RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 38 | మంగళవారం, మార్చి 05, 2024 | పేజీలు : 4

## మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితునికి 10 ఏళ్ళ జైలు శిక్ష

సిరిసిల్ల: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ఎనగందుల వెంకటి అనే వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సోమవారం తీర్పును ప్రకటించారు. కేసు వివరాల ప్రకారం.. 2017 జూన్ 4న నిజామాబాద్ గ్రామానికి చెందిన ఎనగందుల వెంకటి అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కుటుంబ సభ్యులు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోనరావుపేట పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఎనుగందుల వెంకట్‌ను రిమాండ్‌కు పంపగా అప్పటి విచారణ అధికారి రమేష్ నాయక్, విజయ్‌కుమార్‌లపై సీఐ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

### ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామక...

# పత్రాల పంపిణీ

### - సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ మార్చి, 4 :** రైతును రాజుగా చేసే పాలనకు నాంది పడింది ఎల్బీ స్టేడియంలోనేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నూతనంగా ఎంపికైన 5,192 మందికి ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించనున్నారు. ఎల్బీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన సభలో సిఎం మాట్లాడుతూ... మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులు, యువత పాత్ర ఎంతో గొప్పదని, విద్యార్థుల త్యాగాలు, బలిదానాలతోనే తెలంగాణ సాకారమైందన్నారు. తెలంగాణ ఏర్పడితే న్యాయం జరుగుతుందని యువత భావించిందని, కానీ కుటుంబ పాలన యువత ఆకాంక్షలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కుటుంబ వ్యక్తుల పదవుల కోసం నిరుద్యోగులను విస్మరించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యుల ఉద్యోగం ఊడగొడితేనే ఉద్యోగాలు వస్తాయని యువత భావించారని చెప్పారు. అనుకున్నట్లే కెసిఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు ఊడిన తర్వాతే యువతకు ఉద్యోగాలు వస్తున్నాయని పేర్కొన్నారు. తనకు ఇంగ్లీష్ రాదని కొందరకు అవహేళన చేస్తున్నారు. తాను జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మీడియం మాత్రమే చదివానని స్పష్టం చేశారు. తాను గుంటూరు, గుడివాడకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానన్నారు.

వేలాది గురుకులాలు నిర్మించామని గత పాలకులు గొప్పగా చెప్పుకున్నారు. ఎక్కడా గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించలేదని ఆరోపించారు. వసతులు లేని అద్దె భవనాల్లో పేద విద్యార్థులు అవస్థలు పడ్డారన్నారు. రేషనలైజేషన్ పేరిట కెసిఆర్ 6 వేల పాఠశాలలను మూసివేశారని తెలిపారు. కుల వృత్తులను వారి పిల్లలు కుల వృత్తులే చేయాలని కెసిఆర్ భావించారని సిఎం పేర్కొన్నారు.

### అభివృద్ధిలో రాష్ట్ర సర్కార్‌కు పూర్తి...

# సహకారం అందిస్తాం

### : పిఎం మోడీ



**ఆదిలాబాద్ మార్చి, 4 :** సోమవారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వర్చువల్ విధానంలో రూ. 56 వేల కోట్ల ప్రాజెక్ట్‌లకు పీఎం ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనలు చేసి జాతికి అంకితం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రాష్ట్రాభి వృద్ధికి తెలంగాణ ప్రభుత్వంకు సీఎం రేవంత్ రెడ్డికి సంపూర్ణంగా సహకరి స్తామన్నారు. తెలంగాణలో గడిచిన పదేళ్లలో వేల కోట్లకు పైగా పనులు ప్రారంభించామన్నారు. ఎన్‌టిపిసి రెండో యూనిట్ ప్రారంభించామని చెప్పారు. దీంతో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని వెల్లడించారు. పేదలు, దళితులు, ఆదివాసీ అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత పదేండ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. అంతకముందు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. కేంద్రంతో ఎలాంటి ఘర్షణ వాతావరణానికి వెళ్లబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి ముందుకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించిన ప్రధాన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని రాకను 4 కోట్ల మంది ప్రజలు స్వాగతిస్తున్నారు. ఎన్టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని చెప్పారు. ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్ట్ 4 వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంది కానీ 1600 మెగావాట్లకు పరిమితమైందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి పెద్దన్నలా ప్రధాని మోదీ సహకరించాలని కోరారు. హైదరాబాద్ మెట్రోకు, మూసీ నది అభివృద్ధికి కేంద్ర సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళ సై, ఎంపీ శ్రీ సోయం బాపురావు, ఎమ్మెల్యే శ్రీ పాయం శంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తదితరులు ఉన్నారు.

## సుప్రీం తీర్పుపై ప్రధాని మోడీ స్పందన

**న్యూఢిల్లీ మార్చి, 4 :** జెఎంఎం ముడుపుల కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది గొప్ప తీర్పుగా ఆయన అభివర్ణించారు. స్వచ్ఛమైన రాజకీయాలకు ఈ తీర్పు దోహదపడు తుందని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ లేదా శాసనసభలో ఓటింగ్ లేదా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి చేసే ప్రసంగాలకు సంబంధించి లంచం ఆరోపణలు వచ్చినపుడు వారు చట్టపరమైన చర్యలకు అతీతులంటూ 1998లో పివి నరసింహారావు ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సోమవారం సుప్రీంకోర్టుకు చెదిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది. ఈ తీర్పుపై ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. సుప్రీంకోర్టు నేడు గొప్ప తీర్పు ఇచ్చిందని, స్వచ్ఛమైన రాజకీయాలకు ఇది దోహదపడడమేగాక వ్యవస్థ పట్ల ప్రజలలో నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు...

## ఇదీ మా ప్రభుత్వ పనితీరు: రేవంత్



**హైదరాబాద్ మార్చి, 4 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లోనే 30వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. లెక్చరర్స్, టీచర్స్, డ్రగ్ ఇన్ స్పెక్టర్, మెడికల్ సిబ్బందికి ఉద్యోగ నియామక పత్రాలను ఇవాళ ఎల్బీస్టేడియంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. టిఎస్పిఎస్సిని పూర్తిగా ప్రక్షాళనలు చేశాం. మూడు నెలల్లోనే 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని.. గత ప్రభుత్వం ఫామ్ హౌస్ మత్తులో ఉండే నిరుద్యోగ సమస్యలను పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రశ్నాపత్రాలు ఏ జిరాక్స్ సెంటర్లో భయటపడతాయో తెలియని పరిస్థితి ఉండేది. కనీసం పెంపుడు కుక్కకు ఉన్న విలువ.. పేదోడి ప్రాణానికి లేదా అని ప్రశ్నించారు. కుటుంబ ఉద్యోగుల కోసం ప్రజల ఉద్యోగాలను ఊడగొట్టేందుకు ప్రయత్నం చేసింది.

## అయోధ్య రామ మందిరం పేరుతో రాజకీయాలు




హైదరాబాద్ : సర్వే జన సుఖినో భవంతు..రాముడు అందరివాడు ఏఒక్కరికి చెందినవాడు కాదు, బిజెపి పార్టీ అయోధ్య రామమందిరం పేరు చెప్పి రాజకీయాలు చేస్తోందని టిపిసిసి ఉపాధ్యక్షుడు డా. మల్లు రవి అన్నారు. ఎవరైనా హిందూ మతానికి నష్టం చేస్తున్నారంటే అది బిజెపి పార్టీయేనని ఆయన విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్, బిఎస్‌పి పార్టీలు కాంగ్రెస్ ని చూసి భయపడ్తున్నాయని అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థి మల్లు రవియే ఉంటారని, దీనిపై ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారన్నారు. తను నలభై సంవత్సరాల నుండి రాజకీయ జీవితంలో వున్నానని కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి నావంతు కృషి చేశానని, తను ఎవరికీ సన్నిహితున్ని కాదు, ఎవరికీ వ్యతిరేకం కాదని మల్లు రవి స్పష్టం చేశారు.

### ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు...

# క్యాన్సర్



బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చీఫ్ సోమనాథ్ క్యాన్సర్ బారిన పడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రూపొందించిన ఆదిత్య ఎల్ 1ప్రయోగం చేపట్టిన రోజే వ్యాధి నిర్ధారణ అయినట్టు తెలిపారు. ఓ మళయాళం వెబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన ప్రస్తుతం పూర్తిగా కోలుకుంటున్నట్టు చెప్పారు. చంద్రయాన్ 3 ప్రయోగం సమయం లోనే ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఆ సమయం లో దాని గురించి నాకు స్పష్టమైన అవగాహన లేదు. కానీ ఆదిత్య ఎల్ 1 మిషన్ ప్రయోగించిన ఉదయమే వైద్య పరీక్షలు చేయించుకున్నా. కొద్ది సమస్య ఉన్నట్టు గుర్తించారు. ప్రయోగం ముగిసిన తర్వాత చెన్నై వెళ్లి మరిన్ని స్కాన్‌లు చేయించగా అప్పుడే నాకు అర్థమైంది నా కడుపులో కణితి పెరిగిందని. మరో రెండు మూడు రోజుల తరువాత నిర్ధారణ అయ్యింది. అది వంశపారం పర్యంగా వచ్చే వ్యాధి అని ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులతోపాటు సహోద్యోగులు షాక్‌కు గురయ్యారని చెప్పారు. "సెప్టెంబర్ 2. 2023 న ఆదిత్య ఎల్ 1 ప్రయోగం చేపట్టిన తరువాత ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

అనంతరం శస్త్రచికిత్సతోపాటు కీమోథెరపీ కూడా చేయించుకున్నా. అలా అవన్నీ భరించాల్సి వచ్చింది. అయితే మొత్తం నాలుగు రోజులై ఆస్పత్రిలో ఉన్నా. ఐదో రోజు నుంచి ఇస్రోలో రోజువారీ బాధ్యతల్లో నిమగ్నమయ్యా. తొలుత కాస్త కంగారు పడినప్పటికీ, క్యాన్సర్‌కు పూర్తి పరిష్కారంగా చికిత్స ఉందన్న విషయంపై ఇప్పుడు పూర్తి అవగాహన వచ్చింది" అని ఇస్రో చీఫ్ పేర్కొన్నారు.

### ఆప్ కార్యాలయం...

# ఖాళీ చేయాల్సిందే




న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ తన పార్టీ కార్యాలయాన్ని ఖాళీ యేసేందుకు ఇచ్చిన గడువును ఈ ఏడాది జూన్ 15 వరకు సుప్రీంకోర్టు పొడిగించింది. రూస్ అవెన్యూలోని ఆప్ కార్యాలయం ఉన్న స్థలాన్ని మౌలిక వసతుల విస్తరణ కోసం ఢిల్లీ హైకోర్టుకు ప్రభుత్వం కేటాయించింది. తన కార్యాలయాలకు అవసరమైన స్థలం కోసం ల్యాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసును సంప్రదించాలని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆప్‌కు సూచించింది. నాలుగు వారాలలోగా ఆప్ దరఖాస్తును పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని తాము ఆ క్రార్యాలయాన్ని ఆదేశిస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ఆప్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదన వినిసితూ ఏశంలోని ఆరు జాతీయ పార్టీలలో ఆప్ ఒకటని తెలిపారు. జానీయ పార్టీగా గుర్తింపు ఉన్న తమకు అన్యాయం జరుగుతోందని ఆయన చెప్పారు. బాదర్‌పూర్‌లో తమకు స్థలం ఇచ్చారని, కాని ఇతర పార్టీలన్నీ మెరుగైన ప్రదేశాలలో ఉన్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కార్యాలయాన్ని ఖాళీ చేయడానికి జూన్ 15 వకు వ్యవధి ఇవ్వాలని ఆయన కోరారు.

## రాష్ట్రంలో ఐఐహెచ్‌టి ఏర్పాటుకు సిఎం కృషి

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి ఇండియన్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ హండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి)ని మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం పాలాభిషేకం చేసింది. గూడూరు శ్రీనివాస్ నేత ఆదేశానుసారం సోమవారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మసున రవికుమార్ నేత అధ్యక్షతన పున్న రామలింగం నేత, పీర్ల పురుషోత్తం నేత, జనరల్ సెక్రటరీ అంకం శ్రీనివాస్ నేత, మచ్చ వరలక్ష్మి నేత, సెక్రటరీ సత్యసాయి బాబు నేత,, సంగారెడ్డి అధ్యక్షుడు బాలె ప్రవీణ్ నేత, దత్తాత్రేయ నగర్ డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ ఎలె నరేందర్ నేత, మసున అశోక్ నేత, కర్నాటి లింగయ్య నేత, వంశీ,ప్రణిత్ తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రముఖ సంస్థ రాష్ట్రానికి మంజూరు కావడం ద్వారా తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా మన రాష్ట్రంలోనే టెక్స్ టైల్ టెక్నాలజీ రంగానికి సంబంధించిన కోర్సులను చదవడానికి వీలుగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకుల పేర్కొన్నారు.

### నాలుగు లోక్‌సభ స్థానాలకు...

## బిఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలలో నాలుగు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బి.వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామ నాగేశ్వర్ రావు, మహబూబాబాద్ నుంచి మాలోత్ కవిత పేర్లను బిఆర్ఎస్ అధినేత ఖరారు చేశారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణలో భాగంగా రెండు రోజులుగా ఆయా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో కెసిఆర్ సమావేశమయ్యారు. సోమవారం ఖమ్మం, మహబూబాబాద్ నియోజకవర్గాల నేతలతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ భేటీ అయ్యారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, సీనియర్ నేత హరీశ్‌రావు, ఎంపీలు కేశవరావు,వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వర రావు, మాలోతు కవిత, మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# కనుమరుగయ్యేది కాంగ్రెస్సే

'ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ' అనే సామెత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి సరిగ్గా సరిపోతుంది. రాహుల్‌గాంధీ చేస్తున్న జోడో యాత్ర కనీసం సొంత పార్టీ నేతలను ఐక్యం చేయకపోగా, ఇండియా కూటమిలో ఎడబాటును ఎగదోసింది. జారిపోతున్న పార్టీ జాతీయ నేతలు, వదిలిపోతున్న కూటమిలోని స్నేహితులు.. కాంగ్రెస్ భవితవ్యాన్ని కండ్లకు కట్టినట్టుగా చూపెడుతున్నారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తుల కోసం పడరాని పాట్లు పడుతున్నా, హస్తం పార్టీకి ప్రతికూల ఫలితాలే ఎదురవుతున్నాయి. ఎజెండా లేని రాహుల్ గాంధీ పాదయాత్ర గాలిలో బాణంలామారి, తోపులాటలకు, తన్నులాటలకు వేదికగా మారింది. పార్లమెంట్ ఎన్నికల ముంగిట నిలబడ్డ 'ఇండియా' కూటమికి ఏ కోణంలో చూసినా కాంగ్రెస్ అక్కరకురానిదిగానే కనిపిస్తున్నది. రాజకీయ పోరు యాత్రను విహారయాత్ర తీరున నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీ దేశం మాట దేవుడెరుగు, హస్తం పార్టీ కార్యకర్తలకే విశ్వాసాన్ని ఇవ్వలేకపోతున్నారు. రాజకీయాల్లో ఉండాల్సిన వాస్తవిక దృక్పథం కొరవడి, సంస్థాగత నిర్మాణం బలహీనపడి, సైద్ధాంతిక కోణం వీడి కేవలం సరంజామా సమకూర్చే వారినే సన్నిహితులుగా చేసుకొని ఎన్నికల సమరానికి కాంగ్రెస్ కాలుదువ్వడం విడ్డూరమే కదా!. జనామోద సాధనా విద్యలో కాకలుదీరిన యోధులు, సుదీర్ఘ అనుభవం, మేధోసంపద, దేశం నలుమూలలపై లోతైన అవగాహన కలిగిన సీనియర్ నాయకుల ఉనికి నేడు పది జనపథ్‌లో నామమాత్రంగా మారింది. వారియర్లపై కాకుండా వార్ రూంలపై ఆధారపడి హస్తం పార్టీ ఓట్ల వేటకు పావులు కదుపుతున్నది. అందువల్లే బీజేపీని నిలువరించే జనామోద ఎజెండాను కూడా కనీసం చర్చగా మలచడంలో చతికిలపడుతున్నది. బీజేపీ సర్కార్ వైఫల్యాలపై ప్రభావవంతమైన ఏ ప్రజాస్వామిక పోరుకూ కాంగ్రెస్ నాయకత్వం వహించి కదిలించలేకపోయింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావుడి, పార్లమెంట్ ఎన్నికలకు ఏడాది ముందు గడబిడ తప్ప, నిర్దిష్టమైన పని తీరు హస్తం పార్టీలో కాగడా పెట్టి వెతికినా కానరాదు. రైతు పోరైనా, ఈశాన్య రాష్ట్రాల రోదనైనా ఉడికిన తర్వాత తిరగవాత గంటెను పట్టుకొని ఫోజులివ్వడమేగానీ ఏ పోరు నూ నడిపిందేలేదు. అందుకే అక్కరకురాని ఆరోవేలులా మారిపోయి, ప్రాంతీయ పార్టీల భుజాలపై హస్తం వేసుకొని యాత్రాయనం కొనసాగిస్తున్నది. నితీష్ వదిలించుకున్నా, దీదీ దుమ్మెత్తి పోస్తున్నా, స్టాలిన్ వెనకాముందాడుతున్నా కారణం బలహీన కాంగ్రెస్‌తో కూడి బీజేపీతో తలపడితే, ప్రమాదకర ఫలితాలు ఖాయమనే కదా? మొదటి దశ జోడో యాత్ర హైవే పొడుగునా అర్థం లేని ప్రయాసగా మారి, ప్రజారాశుల మనోఫలకంపై ఏ ముద్ర వేయకుండానే ముగిసింది. చెరువంతా వలేసి రెండే పర్కలు పట్టినట్లు, డీకే శివకుమార్, రేవంత్‌రెడ్డి లాంటి ఇద్దరు దుడ్డు కర్రలు తప్ప ఢిల్లీ జనపథ్‌కు దొరికిందేం లేదు. రెండో దశ జోడో యాత్రకు కూడా న్యాయ్ యాత్ర అనే పేరు పెట్టి ఉత్తరాదిన ఎడారిలో ఇసుక వ్యాపారిలా ఎన్ని అవస్థలు పడ్డా కాంగ్రెస్ పార్టీని నమ్మేవారెవరు? వృద్ధి నమూనాలకు వక్రదృష్టిని కల్పించి, అంతరాలను పెంచి, జాతి జనులను వైరుధ్యాలకు వేలాడదీసిందే కాంగ్రెస్ సర్కార్లు. ప్రతి ఊరిలో లోహియా, కర్పూరీ ఠాకూర్, అంబేద్కర్ వంటి ఆలోచనపరులుండే రాష్ట్రాలలో, నేరగాడే మళ్లీ బేరమాడేందుకు వచ్చినట్టుగా సామాజిక న్యాయం సూక్తులు వల్లిస్తే ఉత్తరాధీయులు వలలో పడిపోతారా? ప్రభుత్వ విభాగాల్లో, న్యాయ వ్యవస్థలో బీసీలకు భాగస్వామ్యం నేటికీ ఎండమావిగానే ఉండటానికి కారణమే కాంగ్రెస్ కదా? పెరియార్ పోరు సలిపితేనే గాని మొదటి రాజ్యాంగ సవరణకు నాటి హస్తం పెద్దలకు చేతులే రాలేదు. అంబేద్కర్ నిలదీస్తేనే గాని తొలి బీసీ కమిషన్ వేయాలనిపించలేదు. 1952లో మొదటి బీసీ కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌కు కాకా సాహెబ్ కాలేల్కర్‌ను పిలిచి, మందలించి, ఆయనతో డిసెంట్ నోట్ రాయించి, తొలినాళ్లలోనే బడుగుల బతుకుల్లో బండరాళ్లేసింది హస్తం పార్టీ పెద్ద మనుషులే కదా! 1952 నుంచి 1993 దాకా మండల్ కమిషన్ సిఫారసులకే కాదు బీసీల ఎదుగుదలకూ, బీజేపీతో కలిసి అడుగడుగునా అడ్డుపడ్డది కాంగ్రెస్ పార్టీనే. 1980లో మండల్ నివేదిక సమర్పిస్తే 1993 దాకా దశాబ్దానికి పైగా మెజారిటీ ప్రజల హక్కులను చెత్త బుట్టపాలు చేసిందెవరు? ఇండిపెండెంట్ ఇండియాలో దాదాపు ఐదు దశాబ్దాల పాటు పాక్షికంగానైనా అవకాశాలు దక్కకుండా, దగా చేసి అమానవీయ అంతరాల వ్యవస్థలను నిర్మించిందే కాంగ్రెస్ పార్టీ. న్యాయ్ యాత్రలో రాహుల్ మాట్లాడుతున్నవి నిజాలే కానీ, అవి గోముఖ వ్యాఘ్రమైన హస్తం పార్టీ వారసులు వల్లిస్తే, అపహాస్యం పాలవుతారేగానీ ఆకట్టుకోజాలరు. కేంద్ర సర్కార్ కొలువుల్లో, ఏ క్యాటగిరీ ఉన్నత ఉద్యోగాల్లో బీసీలు కేవలం 6.9 శాతం, బీ క్యాటగిరీ ఉద్యోగాల్లో 7.3 శాతం, చివరికి సీ క్యాటగిరీ కొలువుల్లోనూ 15.3 శాతమే.

# కీసర రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా చర్యలు: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అధికారులందరూ సమన్వయము తో పని చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6 వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ గౌతమ్, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, డిసిపి పద్మజ, ఎంఎల్ ఏ మల్లారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఆలయ ఈవో నరేందర్ లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారికేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స వారికీ తెలిపారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి, ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, ఛైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, జెట్ పీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



**శామీర్ పేట(గరుడ వార్త) :** మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం, గ్రామంలో గురువారం మెడిసిటీ హాస్పిటల్ వారు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో పంచాయతీ సెక్రటరీ రాజేశ్వరరెడ్డి, బిల్ కలెక్టర్ భానుచందర్. వైద్యులు దేవిక, జాహ్నవి, కుషులు, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, కవిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు అభివృద్ధి లక్ష్యంగా భారతీయ కిసాన్ సంఘ్



**శామీర్ పేట, (గరుడ వార్త) :** రైతుల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతూ భారతీయ కిసాన్ సాంగ్ రైతుల సమస్యలపై పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బౌరంపేట మల్లారెడ్డి అన్నారు. శామీర్ పేట మండలం బాబా గూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంగ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ ఉత్తర భారత దేశంలో ప్రభుత్వాలను శాసించే స్థాయిలో ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో సైతం భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ గ్రామాన విస్తరించాలని, అందుకు మనమందరం కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. రైతుకు ఏ కష్టం వచ్చినా భారతీయ కిసాన్ సంఘ్ ముందు వరుసలో ఉంటుందని, రైతులను కాపాడుకుని ముందు తరాలకు మంచి దారులు వేసుకుందా మన్నారు. అందుకు మనమందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కౌకుట్ల సురేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి సుదర్శన్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఏ వెంకట్ రెడ్డి, సీనియర్ భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు ఎస్ ప్రభాకర్ రెడ్డి ఇతర జిల్లా కార్యకారిని, మండల బాధ్యులు ఇతర రైతులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ బ్యారేజ్‌పై హైకోర్టులో విచారణ, ధర్మాసనం కీలక ఆదేశం

హైదరాబాద్ : మేడిగడ్డ బ్యారేజ్ వ్యవహారంపై హైకోర్ట్‌లో సోమవారం విచారణ జరిగింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడంపై ప్రభుత్వం జుడిషియల్ విచారణ కోరిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్‌జడ్జ్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వం కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటికే విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించినట్టు ప్రభుత్వం తెలిపింది. విజిలెన్స్ రిపోర్ట్ తర్వాత ఇంజనీర్లను విధుల నుండి తొలగించినట్లు కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడానికి కారణమైన అధికారులపై ఫైనల్ రిపోర్ట్ వచ్చాక చర్యలు తీసు కుంటున్నామని వివరించింది. ఈ ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డ్యామ్స్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసింది. డ్యాం సేఫ్టీ అథారిటీ ఆరు గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్‌ను ఇంప్లీడ్ చేయాలని పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 4 వారాలకు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్ల నిర్మాణాన్ని పరిశీలించేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఆదివారం (మార్చి 3) నియమించింది. కేంద్ర జల సంఘం మాజీ ఛైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ సారథ్యంలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. ఇందులో యూసీ విద్యార్థి, ఆర్.పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్ కుమార్ సింగ్ సభ్యులుగా ఉన్నారు. ఎన్డీఎస్ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితాబ్ మీనా ఈ కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఫియర్లు కుంగిపోవటంతో అప్రమత్తమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం. సుందిళ్ల బ్యారేజీలపై సమగ్రంగా విచారణ జరపాలని ఫిబ్రవరి 13న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసింది. మూడు బ్యారేజీల డిజైన్లతో పాటు నిర్మాణాలను నిపుణుల అధ్వర్యంలో అన్ని కోణాల్లో పరిశీలించాలని ఎన్డీఎస్ఏ విజ్ఞప్తి చేసింది. స్పందించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మూడు బ్యారేజీలపై కమిటీని నియమిస్తూ మార్చి 2వ తేదీ శనివారం రోజున ఉత్తర్వులు జారీ చేసింది. బ్యారేజీలను పరిశీలించి, కుంగు బాటుకు, పగుళ్లకు కారణాలను విశ్లేషించాలని, ఇప్పుడున్న పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయాలను సిఫారసు చేయాలని ఈ కమిటీకి సూచించింది. నాలుగు నెలల్లోపు తమ రిపోర్టును అందజేయాలని కమిటీకి నిర్ణీత గడువును విధించింది.

## రామోజీరావు వద్దకు సిఎం రేవంత్

హైదరాబాద్ : రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావును సిఎం ఏ.రేవంత్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆదిలాబాద్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న సిఎం నేరుగా ఫిల్మ్ సిటీకి వెళ్లారు. గంటకుపైగా రామోజీ రావుతో వివిధ అంశాలను చర్చించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత తెలంగాణలో అభివృద్ధి జరుగుతున్న తీరు, మారిన ప్రజాపాలన విధానాల పైనా మాట్లాడుకున్నారు. అటు దేశంలోనూ ఇటు రాష్ట్రంలోనూ సమకాలీన రాజకీయ పరిస్థితులను చర్చలు జరిపారు.

# జగమంతా మోడీ కుటుంబమే

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీకి కుటుంబమే లేదంటూ ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో మోడీ కా పరివార్(మోడీ కుటుంబం) పేరిట బిజెపి నాయకులు, మోడీ అభిమానులు సోమవారం సోషల్ మీడియాలో తమ మద్దతును చాటుకున్నారు. తమ సోషల్ మలడియా ఖాతాలలో మోడీ కా పరివార్‌గా తమను తాము ప్రకటించుకున్న పార్టీ సభ్యులు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాలను కూడా తమ కుటుంబ సభ్యులుగా చేర్చుకున్నారు. ఆదివారం పాట్నాలో జరిగిన ప్రతిపక్ష ఇండియా కూటమి బహిరంగ సభలో లాలూ ప్రసాద్ ప్రసంగిస్తూ ప్రధాని మోడీపై వ్యక్తిగత విమర్శలు గుప్పించారు. దీనికి ప్రతిగా బిజెపి సోమవారం ఎదురుదాడి ప్రారంభించిది. మోడీ అభిమానులతోపాటు పలువురు సోషల్ మీడియా యూజర్లు ప్రధాని మోడీకి మద్దతుగా తమ పేజీలలో మార్పులు చేశారు. ప్రధాని మోడీపై ప్రతిపక్ష పార్టీల నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, గత 16, 17 ఏళ్లుగా ఇటువంటి కుత్సితమైన ఆరోపణలు చేస్తున్నారని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది సోమవారం నాడిక్కడ విలేకరుల సావేశంలో మండిపడ్డారు.

ఇండియా కూటమి నాయకుల సమక్షంలో ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ మరోసారి ఆదివారం ప్రధాని మోడీపై ఇటువంటి అల్పమైన వ్యాఖ్యలు చేశారని ఆయన చెప్పారు. ఇది చాలా బాధాకరం, విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ కుటుంబం గురించి లాలూ మాట్లాడారని, యావద్దేశం మోడీ కుటుంబమేనని లాలూకు గుర్తు చేయదలచుకున్నానని త్రివేది చెప్పారు. ప్రధాని మోడీకి మద్దతుగా పార్టీ నాయకులు ఏకం కావడం ఇది మదటిసారి కాదు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఈ రకమైన పరిణామమే చోటుచేసుకుంది. చౌకీదార్ చోర్ హై అంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా బిజెపి నాయకులు, మోడీ అభిమానాలు మై భీ చౌకీదార్(నేను కూడా రక్షకుడిని) అంటూ సోషల్ మీడియాలో ఉద్ధృతంగా ప్రచారం చేశారు. ప్రధాని మోడీ నిజాయితీ, అవినీతికి వ్యతిరేకంగా ఆయన తీసుకున్న వైఖరిని కేంద్రంగా చేసుకుని సోషల్ మీడియాలో సాగిన ప్రచారం మోడీ ప్రతిష్టను పెంచడమే గాక గత ఎన్నికల్లో ఆయనను రెండవసారి అధికారంలోకి తీసుకువచ్చింది. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ సాగించిన ప్రచారం ఏమాత్రం పనిచేయకపోగా గత ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. యవద్దేశం తన కుటుంబమని చెప్పుకుంటున్న ప్రధాని మోడీ సోమవారం తెలంగాణలోని ఆదిలాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ భారతదేశంలోని 140 కోట్ల ప్రజలంతా తన కుటుంబమేనని



పునరుద్ఘాటించడం విశేషం. మోడీ ఆ ప్రకటన చేసిన ఒద్ది సేపటికే బిజెపి నాయకులు, అభిమానులు తమ ప్రొఫైల్స్‌లో మోడీ కా పరివార్ అని చేర్చారు. నేటి బహిరంగ సభలో ప్రతిపక్ష పార్టీల వారసత్వ రాజకీయాలను కూడా మోడీ ఎండగట్టారు. వాటి ముఖాలు వేరైనప్పటికీ జురఖాట్, లూట్(అబద్ధాలు, దోపిడీ)లో అందిరీ ఒకే కరమైన స్వరూపమని ఆయన ఆరోపించారు.

# ఎన్‌డిఏ 3.0 రోడ్ మ్యాప్



న్యూఢిల్లీ : మోడీ సర్కారు ఇక ఎన్నికల ప్రత్యక్ష రంగంలోకి దిగేందుకు సంసిద్ధం అయింది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు కేంద్ర మంత్రి మండలి చిట్టచివరి, సుదీర్ఘ కీలక భేటీ ఇక్కడ జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్నికలనే కీలకంగా పరిగణనలోకి తీసుకుని మంతనాలకు దిగారు. 2047 వికసిత్ భారత్ పేరిట విజన్ ఇండియా డాక్యుమెంట్‌ను ఈ సందర్భంగా వెలువరించారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా రూపొందేందుకు తగు చర్యలు తీసుకోవడం ఈ వికసిత్ భారత్ ఆలోచనల సమాహారం, స్వరూపం అని ప్రధాని మోడీ తెలిపారు. ఇది మోడీ సారధ్యపు పాలనలో నిలిచే ప్రాదాన్యత క్రమం అంతకు మించి ప్రాధాన్యతా రంగం అని సగర్వంగా ప్రకటించారు. ఇందుకు అనుసరించే పలు విధానాలను ఎంచుకున్నామని, పాటించాల్సిన పద్ధతులను విశ్లేషించుకున్నామని వివరించారు.

దేశ పౌరుల సాధికారికత, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ వంటివి ఈ విజన్‌లో ప్రదాన అంశాలుగా ఉంటాయి. ఇక ఈ పాతికేళ్ల ప్రణాళికలో భాగంగా తీసుకునే చర్యలతో భారతదేశం పూర్తి స్థాయిలో ప్రగతి స్థాయి దేశం అవుతుంది. సాంకేతికత, సృజనాత్మకతల దిశలో ప్రపంచానికి సరైన నాయకత్వం వహించే స్థాయికి చేరుకుంటుందని తెలిపిన ప్రధాని 2047 విజన్ ఈ విధంగా దేశానికి ఓ కీలక మలుపు అవుతుందని వివరించారు.

ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆషామాషీగా రూపొందించలేదని, దేశవ్యాప్తంగా 2021 డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకూ పలు ప్రాంతాలలో నిర్వహించిన 2700కు పైగా సమావేశాలు, ఇష్టాగోష్టుల తరువాత ఖరారు చేశారని వివరించారు. కేవలం ప్రభుత్వం అనుకుంటే ఇటువంటి విజన్ అమలు వీలు కాదు. అందుకే దీనికి ముందు ప్రభుత్వం 15 రకాల భాగస్వామ్యపక్షాలను గుర్తించింది. వీరితో సంప్రదింపులు జరిపింది. పైగా ప్రభుత్వానికి అందిన 450 సిఫార్సులను పరిశీలించారని వివరించారు. ఈసారి మంత్రి మండలి భేటీకి దాదాపుగా అందరూ మంత్రులు, ప్రభు త్వ విభాగాల కార్యదర్శులు, ముఖ్య ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ప్రధాని మోడీ ఈ సమావేశంలో గంటకు పైగా పాల్గొన్నారు. దేశంలో వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు, సృజనాత్మకతకు పట్టం కట్టడం జరుగుతుంది. దీని కోసం ఈసారి బడ్జెట్‌లో రూ 1 లక్ష కోటి నిధులను కేటాయించినట్లు ప్రధాని తెలిపారు. ఈ నిధు ల ద్వారా సృజనాత్మకత, సాంకేతికల పరిజ్ఞానంలో భారతదేశం ప్రపంచ ఛోదకశక్తి అవుతుందని విశ్వాసంవ్యక్తం చేశారు. దేశంలో అత్యధిక జనాభా ఉంది. ఈ క్రమంలో క్రమేపీ జనాభాలో వయో తారతమ్యాలు పెరుగుతున్నాయి. జనాభాలో అత్యధిక శాతం వయస్సు పైబడుతోంది. ఇక యువతరం ఈస్థానంలోకి వస్తోంది. ఈ సంధి దశలో ఏర్పడే పలు సవాళ్లు, అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని వికసిత భారత్ దిశలో ముందుకు సాగాల్సి ఉందని ప్రధాని తెలిపారు. వికసిత్ భారత్ 2047 ప్రభుత్వం కీలక నినాదం అవుతుందని పేర్కొన్న ప్రధాని పరోక్షంగా పార్టీ శ్రేణులుదీనినే ఎన్నికలలో ప్రధాన స్లోగన్ చేసుకుని ముందుకు సాగాల్సి ఉందని పిలుపు నిచ్చారు. ప్రతి రంగంలోనూ, విభాగంలోనూ వికసిత్ భారత్ సంబంధిత సెమినార్లు ఏర్పాటు చేయాలి. దీని ద్వారా ఈ లక్షసాధనలో అవసరం అయిన ఆలోచనలు పంచుకునేందుకు, అవసరం అయి న కార్యాచరణకు దిగేందుకు వీలేర్పడుతుందని మంత్రులకు తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య లావాదేవీల సం బంధిత సంస్థలు, సమాఖ్యలు అయిన సిఐఐ, ఎఫ్ఐసిసి ఐ వంటివి కూడా ఈ కోణంలో పలు రకాల సెమినార్లు, ఆలోచనల వేదికలను ఏర్పాటు చేసుకోవల్సి ఉంటుందన్నారు. ఇది వారికి తానిచ్చే సలహా అన్నారు. ప్రజల ఆదరణ పొందడం కీలకం అని, వచ్చే వందరోజులలో ఈ మేరకు రూపొందించుకున్న అజెండాపైనా ప్రధాని దృష్టి సారించారు. 2047 భవిష్య భారత్ ప్రణాళిక, ఇక ఇకపై మరో అయిదేండ్ల కార్యాచరణ కీలకం అని కూడా మంత్రులకు తెలిపారు. స్థానిక చాణక్యపురి డిప్లొమాటిక్ ఎన్‌క్లేవ్‌లోని సుష్మాస్వరాజ్ భవన్‌లో విస్తృతస్థాయి మంత్రి మండలి సమావేశం జరిగింది.

**మంత్రులూ సమీక్షించుకోండి**

ప్రస్తుత దశను అంతా వికసిత్ భారత్ 2047 కోణంలో పరిగణనలోకి తీసుకోండని మంత్రులు, అధికారులకు ప్రధాని మోడీ సూచించారు. ఇక సంబంధిత మంత్రిత్వశాఖలు తమ పనితీరునుతెలిపే రికార్డుల్లోకి వెళ్లాలి. ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నారు? అమలు ఏ విధంగా జరిగింది? వీటిద్వారా ఎటువంటి ఫలితాలు, మార్పులు తలెత్తాయి అనేది విశ్లేషించుకుని తీరాల్సి ఉందని స్పష్టం చేశారు. పరిస్థితులు సవాళ్లు, మారుతున్న కాలం బట్టి ప్రభుత్వ నిర్వహణ పంథా మారాల్సి ఉంటుంది. పరిపాలనా అనేది దైనందిన క్రమంలో సజావుగా ప్రభుత్వాల తరచూ జోక్యం ప్రమేయం లేకుండా సాగాల్సి ఉంటుంది. చర్యలకు తగ్గ ఫలితాలు ఉండాలి. ఇకపై అంతా ప్రగతిశీల ప్రభుత్వం, క్రియాశీలక ఉత్తమ పాలన వ్యవస్థలపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఇక కేంద్రం చేపట్టిన పలు ప్రగతి ప్రజా కేంద్రీకృత పథకాలను, గత పది సంవత్సరాల పాలనను, అంతకు ముందటి పాలనా ఫలితాలను ప్రజలు బేరీజు వేసుకుని ఆలోచించుకుని, స్పందించే రీతిలో ప్రజలలో విరివిగా మనోభావాలను నాటాల్సి ఉంటుంది. ఇది జరిగితే విజయం మనేదే అని ప్రధాని ఈ దశలో స్పష్టం చేశారు. ఇప్పటి లోక్‌సభ ఎన్నికల విజయం కీలకమే, అయితే దీనికి వికసిత్ భారత్ 2047కు ముడిపెట్టడం దేశ ప్రజల భవిష్యత్తు, దేశ ఔన్నత్యపు కోణంలో మరింత ప్రధానమైన విషయం అని, దీనిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నేతలు ఏ విధంగా మారుమూల ప్రజల వద్దకు తీసుకువెళ్లుతారనేదే కీలకం అన్నారు.

# ఖర్చుదారీ సేద్యం కష్టాలు తీరేదెన్నడు...?



'పొలంలో హలంతో రైతు /నిలుస్తొ డివాళా రేపు' ఇది, అన్నదాత మనుగడపై ఒక మహాకవి వ్యక్తం చేసిన నిండు విశ్వాసం. అయితే రైతులు ఇప్పుడు ఎల్లెడలా పొలంలో హలంతో నిలబడలేకపోతున్నారు. అలా నిలబడేందుకే వారు పొలాలు, పల్లెలు వదిలి తమ 'భాగ్య విధాతలు' ఉండే నెలవులకు మూకుమ్మడిగా కదులుతున్నారు. జరుగుతున్న అన్యాయాలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే, సముద్రాల ఆవల ఐరోపాలోను, మన దేశంలోను ఇప్పుడు చోటు చేసుకొంటున్నది. దేశ రాజధాని న్యూఢిల్లీ బాట పట్టిన అన్నదాతలు తమ ట్రాక్టర్లతో హైవేలను దిగ్బంధం చేస్తున్నారు. వ్యవసాయ వ్యయాలు విపరీతంగా పెరిగిపోయాయి.. వాటికి తోడు వాతావరణ వైపరీత్యాలు అను నిత్యం కల్లోల పరుస్తున్నాయి. పంటపండించిన రైతుకే తిండిలేకుండా పోతున్న దుస్థితి దాపురించింది. కనుక సాగు వ్యయాలు తిరిగి దక్కేలా తమ ఫలసాయానికి చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ఇవ్వాలని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు. వాతావరణ మార్పు వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలలో ప్రవేశపెట్టిన కొత్త చట్టాలు అక్కడ రైతులను ఆందోళనకు పురిగొల్పాయి. ఆ కొత్త చట్టాల ప్రకారం క్రిమిసంహారక మందుల వాడకాన్ని సగానికి, ఎరువుల వినియోగాన్ని 20 శాతం మేరకు తగ్గించాలి. సేంద్రియ సాగు ఉత్పత్తులను రెట్టింపు చేయాలి. వ్యవసాయేతర ఉపయోగాలకు, ముఖ్యంగా జీవ వైవిధ్య పరిరక్షణకు మరింత భూమిని వదిలివేయాలి. ఇందుకు అదనంగా నత్రజని కారక కాలుష్యాన్ని నివారించేందుకు పశుగణాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని నెదర్లాండ్స్ సంకల్పించుకోగా శిలాజ ఇంధనమైన డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీని తగ్గించుకోవాలని జర్మనీ నిర్ణయించింది. వాతావరణ మార్పుతో మనుగడ ముప్పు నెదుర్కొంటున్న ప్రపంచం ప్రస్తావిత చర్యలను తీసుకోవడం అనివార్యమయింది. యూరోపియన్ దేశాలలో వ్యవసాయ రంగం, ప్రపంచ వ్యాప్తంగా ఇతర ఖండాలలో వలే, హరిత గృహ వాయువుల ఉద్గారాలకు పెద్ద ఎత్తున కారణమవుతోంది. ఐరోపాలో వార్షిక ఉద్గారాలలో పదో వంతు వ్యవసాయ రంగానివే కావడం గమనార్హం. ఈ ఉద్గారాలను తగ్గించేందుకు అయ్యే వ్యయాలు యూరోపియన్ సంపన్న రైతులకు భరించరానివే అయినప్పుడు కేవలం జీవనాధార వ్యవసాయం చేస్తున్న ఆసియా, ఆఫ్రికా దేశాల రైతులు ఆ వ్యయాలను ఎలా భరించగలుగుతారు? అధునాతన సేద్య తీరుతెన్నులన్నీ యూరోపియన్ వ్యవసాయ రంగంలో మనకు కన్పిస్తాయి. భారీ సబ్సిడీల ఆలంబనగా ఆ వ్యవసాయం వర్థిల్లుతోంది. 1962 నుంచి యూరోపియన్ యూనియన్ ఉమ్మడి వ్యవసాయ విధానం రైతులకు విశేషంగా ఆర్థిక తోడ్పాటును సమకూరుస్తోంది. అయితే దీనిపై పలు విమర్శలు రావడంతో ఆ ఆర్థిక మద్దతును గణనీయంగా తగ్గించడం అనివార్యమయింది.నేడు యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యవసాయ రంగానికి సమకూరుస్తున్న ఆర్థిక మద్దతు ఈయూ బడ్జెట్‌లో 40 శాతం మేరకు ఉంటోంది. ఈ సహాయాన్ని రైతులకు నేరుగా చెల్లిస్తున్నారు. యూరోపియన్ కమిషన్ సమాచారం ప్రకారం ప్రతి రైతూ 2021లో 6700 యూరోలు (ఇంచుమించు రూ.50 వేలు) నేరుగా అందుకున్నాడు. ఈ సహాయంతో పాటు వ్యవసాయరంగ అభివృద్ధికి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం కూడ జరుగుతోంది.. అనేక సంవత్సరాలుగా వ్యవసాయ 'స్వరూప స్వభావాలు' మారుతూ వస్తున్నాయి. వ్యవసాయ కమతాలు విస్తీర్ణంలో పెరుగుతున్నాయి. మరింతగా సమీకృతమవుతున్నాయి. ఉత్పాదకాల ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో చిన్న రైతుల మనుగడ కష్ట సాధ్యమవుతోంది. సాగు వ్యయాలు పెరిగిపోవడంతో పెద్ద రైతుల సైతం రుణగ్రస్తులు అవుతున్నారు. పైరు సగటు దిగుబడి పెరుగుదల లక్ష్యంగా సేద్యం జరుగుతోంది. ఇందుకు రసాయన ఎరువులను మరింతగా వినియోగించడం అనివార్యమవుతోంది. దీనికి తోడు వాతావరణ అవ్యవస్థతో పంటల సాగు ఖర్చులు తడిపిమోపెడవుతున్నాయి. పెరిగిన సాగు వ్యయాలలతో పాటు మరో రెండు వాస్తవాలను తప్పక ప్రస్తావించి తీరాలి. ఒకటి ఆహార వినియోగ ధరలను అదుపులో పెట్టవలసిన ఆవశ్యకతబీ రెండు వాతావరణ వైపరీత్యాలతో పంట నష్టాలు పెరిగిపోవడం. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో సైతం ఆహార ధరలు అందరికీ అందుబాటులో ఉండడం లేదన్నది ఒక కఠోర వాస్తవం. అంతకంటే ముఖ్యమైన వాస్తవం ఆ దేశాలలో పర్యావరణ సమతౌల్యత తీవ్రంగా దెబ్బ తింటోంది. దేశ రాజధాని ఢిల్లీ ముంగిట నిరసనలు తెలుపుతున్న రైతులు తమ పంట దిగుబడులకు అధిక కనీస మద్దత ధర (ఎమ్ఎస్‌పి)ను డిమాండ్ చేస్తున్నారు. సంపన్న యూరోప్‌లో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లనే వీరూ ఎదుర్కొంటున్నారు. అయితే ఆహార ధాన్యాల సాగు విషయంలో యూరోపియన్ రైతులకు లభిస్తున్నట్టుగా భారతీయ రైతులకు ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఆర్థిక మద్దతు లభించడం లేదు. దేశ ప్రజానీకానికి ఆహారాన్ని సమకూర్చేందుకై రైతుల నుంచి ఆహారధాన్యాలను ప్రభుత్వం సేకరించివలసివున్నది. ధరలను నియంత్రించేందుకు ఇది తప్పనిసరి బీ ఆహార ధరల పెరుగుదలను ఎవరు కోరుకుంటారు? వినియోగదారులు ఎవరూ కోరుకోరు కదా. ఖర్చులు భరించేందుకు రైతులు ఒక పక్క ఇబ్బంది పడుతుండగా మరో పక్క వాతావరణ వైపరీత్యాలు, చీడ, తెగుళ్ల మూలంగా ఆర్థిక నష్టాలు, ఇతర చిక్కులకు లోనవుతున్నారు. ఆహార ధరల పెరుగుదలను అరికట్టేందుకు చౌక దిగుమతులపై ఆధారపడాలి. వీటి వల్ల ధరలు తగ్గుతాయి. నిజమే. అయితే తమ ఉత్పత్తులకు సరైన ధర లభించక పోతే రైతులు నష్ట పోతారు. ఈ పరిస్థితుల్లో భూసార పెంపుదల, నీటి సదుపాయాల మెరుగుదల, జీవ వైవిధ్య పరిరక్షణకు రైతులు ఏమీ ఖర్చు చేయలేరు ఈ సమస్యను అధిగమించడమెలా అంటే పర్యావరణ భద్రతలకు అయ్యే వ్యయాలను మినహాయించుకోవడమే..వ్యవసాయం లాభదాయకంగా ఉండాలంటే ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరమున్నదని రైతులకు చెబుతున్నారు. అయితే విత్తనాలు, ఎరువుల మొదలైన ఉత్పాదకాల వ్యయం తక్కువేమీ కాదు కదా.

# కమలం వైపు ఆకర్ష్.. లాభమేనా?

మహా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ చవాన్ కాంగ్రెస్‌కి రాజీనామా చేయడంలో వ్యక్తిగత ప్రయోజనం ఉండవచ్చు. ఆయన రాజీనామా వల్ల ఆ పార్టీకీ, ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎదురుదెబ్బంటూ వార్తలు వచ్చాయి.సాధారణంగా పెద్ద నాయకుడు పార్టీ మారినప్పుడల్లా ఇలాంటి కథనాలు వెలువడుతుంటాయి. కానీ,అశోక్ చవాన్ విషయం ఆలోచిస్తే ఆయన మహారాష్ట్రలో పార్టీకి చేసింది పెద్దగా ఏమి లేదు. పైగా, ఆయన హయాంలో చోటు చేసుకున్న ఆదర్శ హౌసింగ్ సొసైటీ కుంభకోణం వల్ల ఆనాటి మహారాష్ట్ర ప్రభుత్వంపైనా, కాంగ్రెస్ పార్టీపైనా మచ్చ పడింది.ఆయన మాదిరిగా మహారాష్ట్రలో మరో ఇద్దరు ప్రముఖ నాయకులు కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలగి అజిత్ పార్టీలోనూ, ఏకనాథ్ షిండే పార్టీలోనూ చేరనున్నట్టు వార్తలు వచ్చాయి. అశోక్ చవాన్ కూడా బీజేపీలో చేరుతారనీ,రాజ్యసభ టికెట్ ఇస్తామన్న పిలుపుతోనే ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారంటూ వార్తలు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. కనుక, ఎన్నికల లోపు ఇంకా చాలా మంది గోడదూకే అవకాశం ఉందంటున్నారు.వీరందరూ వ్యక్తిగత అజెండాతో ఎంతో కాలంగా తమను ఆదరించిన పార్టీకి గుడ్‌బై చెబు తున్నారు. వీరిలో మిలింద్ దేవరా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడన్న పేరుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే మాదిరి పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎల్‌డి ఇండియా కూటమి నుంచి వై దొలగి ఎన్‌డిఏ చేరారు. ఆర్ఎల్‌డి వ్యవస్థాపకుడు అజిత్ సింగ్ బీజేపీకి వ్యతిరేక పంథాని అనుసరించేవారు. అజిత్ సింగ్ తండ్రి చరణ్ సింగ్‌కి కేంద్రం ఇటీవల భారత రత్న పురస్కారాన్ని ప్రక టించింది. ఆ ప్రకటన, ఆర్ఎల్‌డి వైదొలగడం రెండూ ఒకేసారి జరగడం వల్ల చరణ్‌సింగ్‌కి భారత రత్న ఇవ్వడం వల్లనే ఆ పార్టీ ఎన్‌డిఏలో చేరినట్టు ప్రచారం జరిగింది. కొత్తగా చేరిన వారితో బీజేపీ,దాని నేతృత్వం లోని ఎన్‌డి ఏ కూటమి బరువు ఎక్కువైన పడవలా తయారవుతుందేమోనన్న సందేహాలు వ్యక్తం అవుతు న్నాయి. అయితే, అయోధ్యలో రామాలయం నిర్మాణం సాకారం కావడంతో బీజేపీ పట్ల జనాకర్షణ ఉందన్న మాట వినిపిస్తోంది. గతంలో ఇందిరాగాంధీ బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం సాధించినప్పుడు, ఆమెహత్యా నంతరం జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌లొకి ఇదే మాదిరిగా భారీ ఎత్తున చేరికలు ఉండేవి.కాంగ్రెస్ ముక్త భారత్ (కాంగ్రెస్ లేని భారత్) బీజేపీ లక్ష్యమే కావచ్చు, కానీ, కాంగ్రెస్ నుంచి వచ్చిన వారినే చేర్చుకోవడం వల్ల ఆ పార్టీకి ప్రయోజనకరమన్న ప్రశ్న తలెత్తుతోంది. మధ్యప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ లోకి క్యూ కట్టేందుకు పలువురు ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంగా ఉన్నారు. వీరందరికీ గేట్లు తెరిస్తే, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ల పంపిణీ క్లిష్టతరమవుతుంది. ఇప్పటికే, చాలా చోట్ల ఒకే స్థానానికి ఇద్దరు,ముగ్గురు పోటీ పడుతున్నారు. రాజకీయాల్లో ఏ పార్టీ అధికారం లో ఉంటే, అందులో చేరడం విశేషమూ కాదు, అసాధా రణమూ కాదు. ఎవరిని పడితే వారిని ఆహ్వానించి అక్కున చేర్చుకోవడం వల్ల వచ్చే ప్రమాదాన్ని బీజేపీ పెద్దలు గుర్తించాలి.చేర్చుకునేటప్పుడు బాగానే ఉంటుంది. అది బలుపు కాదు, వాపు అన్న సంగతి తర్వాత తెలుస్తుంది. బీజేపీలో ఇప్పటికే కాంగ్రెస్ సంస్కృతి వచ్చి చేరిందన్న మాటలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో అప్రదిష్టపాలైన వారిని చేర్చుకోవడం వల్ల తమ పార్టీకి ఏమంత మేలో కమలనాథులు ఆలోచించాలి. పార్టీ అగ్రనాయకుల దృష్టికి రాకుండానే, రాష్ట్ర స్థాయిలో ఈ చేరికలు, కూడికలు జరుగుతున్నట్టు భోగట్టా. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తరచూ ప్రకటించే 370 స్థానాల సంఖ్యను చేరుకునే అవకాశం ఇప్పటికే ఉంది కనుక, ఇక పైన ఆయారామ్‌లకు పార్టీ తీర్థం ఇచ్చే ముందు అన్ని కోణాల్లో ఆలోచించడం అత్యవసరం. ఎన్నికల షెడ్యూ లు ప్రకటన తర్వాత ఈ చేరికలు ఇంకా భారీ ఎత్తున ఉండవచ్చు. చాలా రాష్ట్రాల్లో అధికార పార్టీల్లోకి ప్రతి పక్షాల ఎమ్మెల్యేలు చేరడం కోసం తెరవెనక సంప్రదింపు లు జరుపుతున్నారు. అయితే గతంలో మాదిరిగా వేటు పడుతుందేమోనని కొందరు వెనక్కి తగ్గుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ పరిస్థితి ఉంది. రాజ్యసభ ఎన్నికలకు బలాన్ని సమకూర్చుకోవడానికి ఫిరాయింపు లను అధికారంలో ఉన్న పార్టీలు ప్రోత్సహిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికలకు ఎమ్మెల్యేల సంఖ్య సరిపోని రాష్ట్రాల్లోనే అధికార పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయి. మహారాష్ట్రలో మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ రాజ్యసభ టిక్కెట్టు ఆశించి పార్టీ ఫిరాయించినట్టు సమాచారం. అలాగే ఎన్సీపీ అజిత్, ఉద్ధవ్ వర్గాలు కూడా ఈ మాదిరిగా ప్రత్యర్థి శిబిరాల నుంచి ఎమ్మెల్యేల ను ఆకర్షించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నాయి.

# నీటి వాటా తేల్చకుండా ఓట్లు అడిగే హక్కు మోదీకి లేదు : మంత్రి మోదీ

ఆదిలాబాద్ బహిరంగ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను మంత్రి జూపల్లి ఖండించారు. సెక్రటేరియట్ మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. నీటి వాటా తేల్చకుండా తెలంగాణ ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి లేదన్నారు. హడావుడిగా పార్లమెంట్ లో బిల్లు పెట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్ లో కలిపిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం.. కృష్ణా జలాల్లో నీటి వాటాను ఎందుకు తేల్చడం లేదని ప్రశ్నించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాను ఎందుకు కల్పించడం లేదని అడిగారు. బీఆర్ఎస్ – కాంగ్రెస్ పార్టీలది అవినీతి, బంధుప్రీతి అని ప్రధాని మోదీ విమర్శ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ప్రధాని పదవి స్వీకరించకుండా త్యాగం చేసిన ఘనత సోనియా గాంధీ, రాహుల్ గాంధీది అని కొనియాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

సీబీఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలతో ఎంతో మందిని అరెస్ట్ చేపించిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం... బీఆర్ఎస్ అవినీతి, దోపిడీపై ఎందుకు విచారణకు ఆదేశించ లేదో సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై ఎందుకు విచారణ చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో అవినీతి జరిగిందని తెలిసి కూడా మీరు ఎందుకు దర్యాప్తు చేయించలేదో సమాధానం చెప్పాలన్నారు. కక్ష్య సాధింపులో భాగంగానే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కేటాయింపులో తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. కుల, మతాల పేరుతో చిచ్చు పెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తూ.. ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రామరాజ్యం అంటున్నారు కానీ.. ఆ రీతిలో పాలన ఎందుకు సాగించడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. బీఆర్ఎస్ పాతాళంలోకి వెళ్ళిపోయిన పార్టీ.. పార్టీ నేతలను, కార్యకర్తలను కాపాడుకోవడం కోసం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల పేరుతో నాటకాలు ఆడుతున్నారు.. ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నాలుగు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. 28 వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీకి ఒకటో, రెండో సీట్లు వచ్చుడు కూడా కష్టమేనన్నారు.

# చంద్రయాన్-3 ఆవిష్కరణలు....!

భారత్ పంపిన చంద్రయాన్- 3 మిషన్ స్పేస్ క్రాఫ్ట్‌లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు చంద్రుడిపై 10 రోజుల పాటు డేటా, ఫోటోల సేకరణ జరిపి వాటిని పరిశీలన కోసం భూమికి పంపాయి. ల్యాండర్- రోవర్‌లు పని చేయడానికి అవసరమైన బ్యాటరీలు ఛార్జ్ అవడానికి సూర్యరశ్మి అవసరం. దక్షిణ ధ్రువంపై పగటి సమయం ముగియడంతో గత ఏడాది సెప్టెంబర్ తొలి వారంలో విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లను ఇస్రో స్లీప్ మోడ్‌లోకి పంపింది. తిరిగి సెప్టెంబర్ 22వ తేదీన సూర్యోదయం అయ్యే సమయాన రెండూ తిరిగి యాక్టివ్ అవుతాయని ఇస్రో శాస్త్రవేత్తలు ఆశించారు. ల్యాండర్ చంద్రుడిపై దిగిన క్షణం నుంచి విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు తీసిన చిత్రాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇస్రో సోషల్ మీడియా వేదికగా ప్రజలకు అందజేసింది. ఈ చిత్రాలు చాలా మంది భారతీయుల్లో సరికొత్త ఆసక్తిని రేకెత్తించాయి. కొంత మంది మాత్రం ఈ సమాచారం ప్రాముఖ్యత ఏంటి, అవి ఎందుకు ఉపయోగపడతాయని ఆన్‌లైన్‌లో పరిశోధనలు ప్రారంభించారు. దీంతో నాసా పూర్వపు శాస్త్రవేత్త, ఢిల్లీకి చెందిన స్పేస్ ఎడ్యుకేషన్ సంస్థ కో ఫౌండర్ మిలా మిత్రా జాతీయ మీడియా సంస్థలతో మాట్లాడుతూ అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. ప్రజ్ఞాన్ రోవర్‌ను స్లీప్ మోడ్‌లోకి పంపే కొన్ని గంటల ముందు ప్రజ్ఞాన్ రోవర్ 100 మీటర్లు (328 అడుగులు) పైగా ప్రయాణించింది. ఇంకా కొనసాగుతోంది అని ఇస్రో ట్వీట్ చేసింది. ప్రజ్ఞాన్ సెకనుకు 1 సెంటీ మీటర్ వేగంతో 6 చక్రాలతో చాలా దూరమే ప్రయాణించింది. దీని ప్రాముఖ్యాన్ని మిత్రా వివరిస్తూ, ఎవరూ ఎక్కువగా అన్వేషించని దక్షిణ ధ్రువ ప్రాంతంలో సంచరిస్తూ, బిలాల్లో పడిపోకుండా సురక్షితంగా రోవర్ ప్రయాణం చేసింది అని వెల్లడించారు. ఈ సందర్భంగా రోవర్‌కు అమర్చిన చక్రాలకు సంబంధించిన ప్రత్యేక అంశాలను మిత్రా వివరించారు. రూకర్ బూగీ అని పిలిచే మెకానిజాన్ని ఇందులో వినియోగించారు. అంటే ఆరు చక్రాలు ఒకేసారి కదలవు. దీని వల్ల రోవర్‌పైకి కిందకు కదిలేందుకు వీలవుతుంది. కానీ, ఒకవేళ లోతైన బిలంలో పడిపోతే పైకి రాలేకపోవచ్చు. అందువల్ల రోవర్‌ను నేలపై ఉన్న బిలాల చుట్టూ వెళ్లేలా చేయడం, లేదంటే దిశ మార్చుకునేలా చేయడం ముఖ్యం. కమాండ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలు రోవర్‌కు అమర్చిన కెమెరాల ద్వారా, అక్కడ నేలపై ఏముందో గమనిస్తూ రోవర్‌ను ముందుకు నడిపించారు. రోవర్ ఆటోమేటెడ్ కాదు. అది పంపే చిత్రాలను ఆధారం చేసుకుని, కమాండ్ సెంటర్ నుంచి నియంత్రించారు. రోవర్ పంపే ఫోటోలు కమాండ్ సెంటర్‌ను చేరుకోవడంలో కాస్త ఆలస్యం అవుతుంది. ఎందుకంటే ప్రజ్ఞాన్ రోవర్ సమాచారాన్ని మొదట విక్రమ్ ల్యాండర్‌కు పంపుతుంది. ల్యాండర్ దానిని ఆర్బిటర్‌లోకి పంపుతుంది. ఆర్బిటర్ భూమికి చేరవేస్తుంది అని ఆమె తెలిపారు. కాబట్టి, ఆదేశాలు రోవర్‌ను చేరే సమయానికి అది బిలానికి కొన్ని అడుగుల దూరంలో మాత్రమే ఉంది.అయితే ప్రజ్ఞాన్ రోవర్ రెండు బిలాల మధ్య నుంచి సురక్షితంగా ప్రయాణం చేసి, కమాండ్ సెంటర్‌కు వేగంగా సమాచారం పంపిందని మిత్రా వివరించారు. ల్యాండర్ విక్రమ్‌కు అమర్చిన ప్రోబ్ చంద్రుడి ఉపరితలంపై ఉన్న మట్టితో పాటు, 10 సెంటీమీటర్ల లోతులో ఉన్న మట్టిని కూడా పరిశీలించింది. ఆ తరువాత తొలి దశ సమాచారాన్ని సేకరించి కమాండ్ సెంటర్‌కు పంపింది. ఈ సమాచారంలో చంద్రుడి ఉపరితలంపైనా, నేలలోపలఉన్న ఉష్ణోగ్రతల్లో గణనీయమైన వ్యత్యాసాలు కనిపించాయి. ఉపరితలంపై ఉష్ణోగ్రత 60 డిగ్రీలు ఉండగా, లోతుకు వెళ్లే కొద్దీ భారీగా పడిపోయింది. 80 మిల్లీమీటర్ల లోతున ఉష్ణోగ్రత -10 డిగ్రీలకు పడిపోయింది. చంద్రుడిపై ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని నాసా ఇంతకు ముందే ప్రకటించింది. ఆ ప్రకారం పగటిపూట చంద్రుడి భూమధ్య రేఖ సమీపాన ఉష్ణోగ్రత 120 డిగ్రీల సెల్సియస్, రాత్రి వేళ -130 డిగ్రీలు సెల్సియస్ పడిపోతుంది. శాశ్వతంగా సూర్యరశ్మి పడని బిలాల్లో ఉష్ణోగ్రత 250 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది. ఉష్ణోగ్రతల్లో ఉన్న ఈమార్పు చాలా కీలకమైనది మిత్రా అన్నారు. లూనార్ రిగోలిత్గా పిలిచే ఈ చంద్రుడి మీది మట్టిని మంచి ఇన్సులేటర్‌గా చెప్పవచ్చని అన్నారు. దీని ద్వారా ఏం తెలుసుకోవచ్చుంటే వేడి, చలి, రేడియేషన్లను నిరోధించేందుకు ఈ మట్టిని ఉపయోగిస్తూ స్పేస్ కాలనీలను నిర్మించవచ్చు. అంతేకాకుండా, నేలలోపల నీటి ఉనికి ఉందనడానికి ఇది ఒక సూచన అని అన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువపు ఉపరితలంలో ఉన్న మూలకాల ఉనికిని తెలుసుకునేందుకు రోవర్ లేజర్ డిటెక్టర్‌ను అమర్చారు. ఈ లేజర్ డిటెక్టర్ ద్వారా ఉపరితలంలో అల్యూమియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్, ఆక్సీజన్ మూలకాలు ఉన్నాయని గుర్తించారు. అన్నిటికన్నా ముఖ్యమైనది సల్ఫర్ ఉనికిని నిర్ధారించడమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తొలిసారిగా చంద్రుడి ఉపరితలంలో సల్ఫర్ ఉనికిని గుర్తించామని ఇస్రో పేర్కొంది. చంద్రుడిపై సల్ఫర్ ఉనికి గురించి 1970లలోనే తెలుసు. అయితే, రోవర్ చంద్రుడి నేలపై ఉన్న ఖనిజం లేదా స్ఫటికంలోని భాగంలో ఉన్న సల్ఫర్‌ను కాకుండా, చంద్రుడి ఉపరితలంపైనే సల్ఫర్ ఉన్నట్లు గుర్తించడం అద్భుతమైన విషయంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మట్టిలో సల్ఫర్ ఉనికిని కనుక్కోవడం వివిధ కోణాలలో కీలకమైన అంశం.

సాధారణంగా అగ్నిపర్వతాలనుంచే సల్ఫర్ వెలువడుతుంది. దీనిని బట్టి మనకు చంద్రుడి ఆవిర్భావం, భౌగోళిక పరిస్థితులు, పరిణామక్రమంపై సమాచారం తెలుస్తుందిఅని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇది మాత్రమే కాకుండా సల్ఫర్ కనిపించడమంటే చంద్రుడి ఉపరితలంపై నీటి ఉనికికి ఒక సూచిక.సల్ఫర్ సహజ ఎరువు. ఇక్కడ మరో మంచి విషయం ఏంటంటే చంద్రుడిపై సహజంగా మొక్కలు పెరగడానికి సల్ఫర్ పని కొస్తుంది.

# అకృత్యాలకు ఆవాసంగా గుజరాత్ లా వర్సిటీ



అహ్మదాబాద్ : గుజరాత్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (జిఎన్ఎల్‌యు) ప్రాంగణంలో వేధింపులు, అత్యాచారాలు, స్వలింగ సంపర్కం, వివక్ష వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇవేవో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు కావు. గుజరాత్ హైకోర్టు నియమించిన నిజ నిర్ధారణ కమిటీ గత వారం న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలోని చేదునిజాలు. ఈ నివేదిక 'నిజంగా భయానకం'గా ఉన్నదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ దారుణాలకు జిఎన్ఎల్‌యుయే బాధ్యత వహించాలని ప్రధాన న్యాయమూర్తి సునీతా అగర్వాల్, న్యాయమూర్తి అనిరుద్ధ మయీతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. అకృత్యాలపై గళం విప్పకుండా విద్యార్థుల గొంతుకను వర్సిటీ యాజమాన్యం అణచివేస్తోందని మండిపడింది. జిఎన్ఎల్‌యూలో చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగికదాడి జరిగిందని, మరో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని సామాజిక మాధ్యమాలలో వచ్చిన వార్తలపై మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వీటిని సుమోటోగా స్వీకరించిన న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి హర్షా దేవాని నేతృత్వంలో నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. యూనివర్సిటీపై వచ్చిన వార్తలను వర్సిటీకి చెందిన అంతరంగిక ఫిర్యాదుల కమిటీ (ఐసిసి), రిజిస్ట్రార్ అంతకుముందు తోసిపుచ్చారు. 'ఇది జాతీయ న్యాయ యూనివర్సిటీ ఎలా అవుతుంది? ఏమీ జరగలేదని, విచారణను నిలిపివేశామని రిజిస్ట్రార్ ఓ అఫిడవిట్ సమర్పించారు. ఇలాంటి వ్యక్తులు పిల్లలను ఎలా రక్షిస్తారు?' అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. వర్సిటీ ప్రాంగణంలో అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి రెండు సంఘటనలు మాత్రమే జరగలేదని, అనేక ఇతర దారుణాలు కూడా చోటుచేసుకున్నాయని బెంచ్ అభిప్రాయపడింది. విద్యార్థుల ఫిర్యాదులను వర్సిటీ అధికారులు బుట్టదాఖలు చేశారని నిజనిర్ధారణ కమిటీ తేల్చిందని తెలిపింది. పైగా విద్యార్థులు తమ సమస్యలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడాన్ని నేరంగా వారు పరిగణించారు. ఇలాంటి పోస్టుల వల్ల వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించారు.

# సందేశ్‌ఖలి అల్లర్ల కేసులో షాజహాన్ ఎట్టకేలకు అరెస్టు.........!



కోల్‌కతా : అన్నివైపుల నుంచి విమర్శలు రావడంతో సందేశ్‌ఖలి కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షాజహాన్‌ను బెంగాల్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో మినాఖాహ బ్లాక్‌లో గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్న పోలీసులు బసిర్‌హత్ కోర్టులో హాజరుపరచగా, ది రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది. సందేశ్‌ఖలీలో హింసకు కారకుడైన ఈ ఘరానా నాయకుణ్ణి ఇన్ని రోజులు కాపాడుకొచ్చిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కంటి తుడుపు చర్యగా పార్టీ నుంచి ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సస్పెన్షన్‌ను చాలా మంది ఇప్పటికే ఎగతాళి చేయనారంభించారు. ఈ కేసును ప్రభుత్వం తన కనుసన్నల్లోని సిఐడి దర్యాప్తునకు అప్పగించింది. సందేశ్‌ఖలి మహిళలపై అత్యాచారం, దహనం, దోపిడి, హత్యలు, భూములను అక్రమించుకోవడం వంటి తీవ్ర అభియోగాలతో 10కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నప్పటికీ షాజహాన్ జోలికి పోవడానికి పోలీసులు సంకోచించారు. కారణం అతనికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ దన్నుగా నిలవడమే. ప్రజా ఉద్యమాల నుంచి ఒత్తిడి, కోర్టు చీవాట్లు వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం అతడిని అరెస్టు చేయక తప్పలేదు. ఇందుకు 2 నెలల సమయం పట్టింది. గురువారం కోర్టుకు తీసుకొచ్చిన సమయంలో పోలీసులు అతనికి ఎలాంటి సంకెళ్లు వేయలేదు. కనీసం పోలీసులు అతన్ని పట్టుకోనూ లేదు. దర్జాగా కోర్టు హాల్లోకి షాజహాన్ నడుచుకుంటూ వెళ్లాడు.

# బాబు మోహన్ సంచలన నిర్ణయం



హైదరాబాద్ : బిజెపికి రాజీనామా చేసిన బాబు మోహన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఆయన కెఎ పాల్ సారథ్యంలోని ప్రజా శాంతి పార్టీలోకి చేరారు. బాబు మోహన్‌కు కండువా కప్పి కెఎ పాల్ తన పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఆఫీసులో సోమవారం కెఎ పాల్ మీడియాతో మాట్లాడారు. బాబు మోహన్ ప్రముఖ టాలీవుడ్ నటుడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. రెండు సార్లు టిడిపి ఎంఎల్ఎగా, ఒకసారి టిఆర్ఎస్ ఎంఎల్ఎగా చేశారు. మంత్రిగానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవలే ఆయనకు, ఆయన తనయుడికి మధ్య విభేదాలు వచ్చాయి. ముఖ్యంగా రాజకీయాల విషయాల్లోనే ఈ విభేదాలు వచ్చాయి. ఆ తర్వాత బాబు మోహన్ పార్టీకి రాజీనామా చేశారు. బిజెపి అసెంబ్లీ ఎన్నికలకు టికెట్ ఇచ్చినా ఆయన స్వీకరించలేదు. బాబు మోహన్ పార్టీలో చేరడం గురించి కెఎ పాల్ మాట్లాడారు. బాబు మోహన్ చేసిన సేవలు అందరికీ సుపరిచితం అని వివరించారు. 1451 సినిమాల్లో ఆయన నటించి మెప్పించారని తెలిపారు. ఆయన జన్మించిన వరంగల్ నుంచి ప్రజా శాంతి పార్టీ తరఫున లోక్ సభ ఎన్నికల బరిలో ఆయన దిగుతారని వెల్లడించారు. తెలుగు ప్రజలు ఇన్ని రోజులు, బిజెపి, బిఆర్ఎస్, టిడిపి, కాంగ్రెస్ పాలనలు చూశారని, ఒక్కసారి ప్రజా శాంతి పార్టీ పాలననూ చూడాలని కెఎ పాల్ సూచించారు. తెలంగాణలో బాబుమోహన్‌ను గెలిపించి బిజెపికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని ప్రజలను కోరారు.

# జైళ్లలో కుల ఆధారిత వివక్ష, విభజన వద్దు

న్యూఢిల్లీ: ఖైదీలను వారి కులం, మతం ఆధారంగా వేరు చేయడానికి అందించే "వివక్షపూరిత" నిబంధనలు వారి సంబంధిత జైలు మాన్యువల్, చట్టంలో లేవని నిర్ధారించుకోవాలని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యుటి)లోని జైలు పరిపాలనలను విభాగాలకు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇటువంటి జైలు మాన్యువల్‌లు, చర్యలు తమ దృష్టికి వచ్చాయని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని మంత్రిత్వ శాఖ పేర్కొంది.



# పశ్చిమ దేశాల ఆటలు సాగవు పుతిన్..!



**మాస్కో :** రష్యాను మరో ఉక్రెయిన్ లాగా మార్చాలని అమెరికా, దాని మిత్ర దేశాలు కుతంత్రాలు పన్నుతున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. మాస్కోలోని గోస్టినీ డ్వోర్‌లో ఫెడరల్ అసెంబ్లీలో వార్షిక ప్రసంగం చేస్తూ, పశ్చిమ దేశాల కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉక్రెయిన్‌తో పాటు అనేక ఇతర దేశాలను ధ్వంసం చేసినట్టే రష్యాను ధ్వంసం చేయాలని పశ్చిమదేశాలు చూస్తున్నాయి. అటువంటి ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. అవి తమ వలసవాద అలవాట్లను మానుకోలేదు, ప్రపంచవ్యాప్తంగా జాతుల మధ్య ఘర్షణలను రేకెత్తించి తమ ప్రపంచ ఆధిపత్యానికి తిరుగులేకుండా చూసుకోవాలని చూస్తున్నాయి అని రష్యా నాయకుడు ఫెడరల్ అసెంబ్లీకి చెప్పారు, రష్యాను వారికి అణగిమణిగి ఉండే ప్రదేశంగా మార్చాలనుకుంటున్నారు. మన అంతర్గత వ్యవహారాల్లో ఎవరినీ జోక్యం చేసుకోవడానికి అనుమతించే ప్రశ్నే లేదు అని పుతిన్ ఉద్ఘాటించారు. రష్యాపై అమెరికా, దాని మిత్రదేశాలు ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇందులో ఉక్రెయిన్ వివాదం ఒక అంశం మాత్రమే.కొత్త బహుళ ధ్రువ ప్రపంచం ఉద్భవిస్తున్నదనే విషయాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆర్థిక పరిమితుల నుండి సైనిక శక్తిని పూర్తిగా ఉపయోగించడం వరకు అన్ని విధాలుగా రష్యాతో సహా ఎదుగుతున్న శక్తులను తొక్కేయాలని పాశ్చాత్య దేశాలు చూస్తున్నాయి. ఉక్రెయిన్ రష్యన్ పౌరులపై హింసను ప్రయోగించినందున ఆ దేశంపై చర్య తీసుకోవడం మినహా తమకు "వేరే మార్గం లేదు" అని పుతిన్ పేర్కొన్నారు.

# గాజాలో ఊచకోతకు లైసెన్స్ ఇచ్చింది అమెరికానే.......!





**న్యూయార్క్ :** పాలస్తీనీయులను చంపేందుకు ఇజ్రాయిల్‌కు లైసెన్స్ ఇచ్చింది అమెరికాయేనని ఐక్యరాజ్య సమితికి చెందిన మూడు సంస్థలు విమర్శించాయి. పాలస్తీనీయులకు మానవతా సాయం అందకుండా చేయడం, కాల్పుల విరమణకు అడ్డు పడడంలో ఇజ్రాయిల్‌కు ఎంత పాత్ర ఉందో, అమెరికాకు కూడా అంతే పాత్ర ఉందని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి), మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం (ఓసిహెచ్ఎ), ఆహార, వ్యవసాయక సంస్థ (ఎఫ్ఎఓ) చెప్పాయి. గాజాలో తాజా పరిస్థితిపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి)కి ఈ సంస్థలు మంగళవారం ఇచ్చిన రిపోర్టులో ఈ మేరకు అభిప్రాయపడ్డాయి. గుయానా, స్విట్జర్లాండ్, అల్జీరియా, స్లోవేనియా అభ్యర్థన మేరకు ఐరాస భద్రతా మండలి దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించింది. గాజాలో మొత్తం 22 లక్షల మంది పాలస్తీనీయులకు గాను చాలా మంది ఇప్పటికే ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్లిపోగా, మిగిలినవారిలో 5 లక్షల మంది ఇప్పుడు తీవ్రమైన క్షామాన్ని ఎదుర్కొంటున్నారని డబ్ల్యుఎఫ్‌పి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కార్ల్ స్కువా భద్రతామండలికి తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం చాలా తీవ్రంగా ఉందని స్కువా తెలిపారు. ఆసుపత్రులకు విద్యుత్, మంచినీరు సరఫరా చేయడం, పారిశుధ్య సేవలను పునరుద్ధరించడం, మానవతా సాయం సరఫరాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడడం తక్షణం చేపట్టాలని స్కువా తెలిపారు. ఇజ్రాయిల్ దళాలు విచక్షణా రహితంగా జరుపుతున్న వైమానిక దాడుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోయింది, ఆసుపత్రులను, ఐరాస సహాయక శిబిరాలను కూడా వారు వదల్లేదు. 5 మాసాలుగా సాగుతున్న ఈ దాడుల్లో గాజాలో వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని చెప్పారు.

# ఈ లక్షణాలు వుండే జాగ్రత్త...!



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఇప్పుడు చాలా మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. లక్షణాలు తెలుసుకొని వ్యాధిని గుర్తించేలోపే అది ప్రాణాల మీదకు వస్తుంది. అందువలన ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు వైద్యులు. మరీ ముఖ్యంగా ఇప్పుడున్న యూత్ ఎక్కువగా బయట ఫుడ్‌కు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మసాలా ఫుడ్ అతిగా తింటూ గ్యాస్ట్రిక్, ఆసిడీటి, క్యాన్సర్ లాంటి అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే ప్రస్తుతం క్యాన్సర్ అనేది చాపకింద నీరులా ప్రవహిస్తుంది. రోజు రోజుకు వేల సంఖ్యలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. మన చుట్టూ రోజు కలిసి మెలసి తిరిగిన వారు కూడా క్యాన్సర్ వ్యాధి బారిన పడి దాని లక్షణాలు గుర్తించి, వ్యాధి అని కన్ఫామ్ చేసుకునేలోపే మరణిస్తున్న సంఘటనలు అనేకం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు చాలా జాగ్రత్తలు చెబుతున్నారు. ఇలాంటి చిన్న చిన్న లక్షణాలు కనివించినా అస్సలే నెగ్లెట్ చేయకూడదని హెచ్చరిస్తున్నారు. అవి ఏ లక్షణాలో ఇప్పుడు చూద్దాం. విపరీతమైన కడుపునొప్పి కడుపులోని క్యాన్సర్‌కు కారణం కావచ్చు అంటున్నారు వైద్యులు. అతిసారం, మలబద్ధకం, మలం నల్లగా వెళ్లడం, తరచూ తిన్న తర్వాత వాంతి కావడం, పొత్తికడుపు నొప్పి, వాపు రావడం, ఆకలి లేకపోవడం, అతిగా బరువు తగ్గడం, అలసట, వంటివి క్యాన్సర్‌కు కారణమయ్యే ఛాన్స్ ఉన్నదంట. అందువలన ఇలాంటి లక్షణాలు కనిపిస్తే అస్సలే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.

# క్యారెట్ ఎక్కువ తీసుకుంటే నష్టాలివే?



క్యారెట్‌లు ఎక్కువ తిన్నా కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఎందుకంటే కొన్ని సహజ చక్కెరలు ఉంటాయి. స్వచ్ఛమైన క్యారెట్ రసంలో చక్కెర తక్కువగా ఉంటుంది. కానీ ప్రాసెస్ చేసిన రసాలలో తరచుగా సువాసన కోసం జోడించిన చక్కెరలు ఉంటాయి. దీనివల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు సమస్యలు తలెత్తుతాయి. అలాగే, చిన్న పిల్లలకు క్యారెట్ ఎక్కువగా పెట్టడం సురక్షితం కాదు, అందువల్ల చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే పిల్లలకు అందివ్వాలి. అలాగే జ్యూస్ చేసేటప్పుడు ఇందులో అత్యంత పోషకమైన ఫైబర్ మొత్తాన్ని కోల్పోతాము. అందువల్ల, క్యారెట్లను జ్యూస్ చేసుకుని తాగడం, తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఒకేలా ఉండవు. అందుకే క్యారెట్ జ్యూస్ తాగే బదులు క్యారెట్ ను సలాడ్ గా లేదా పచ్చిగానే తీసుకోవడం మంచిది. ప్రతి రోజూ క్యారెట్ తినడం అలవాటు చేసుకున్న వారిలో ఇరిటేషన్, నిద్రలేమి, నెర్వెస్ నెస్ మరియు వాటర్ బ్రాష్ వంటి నెగటివ్ ఎఫెక్ట్స్ ను ఎదుర్కుంటారు. క్యారెట్స్ ఎక్కువగా తినడం వల్ల క్యారెట్ లోని బీటా కెరోటిన్, కెరోటినాయిడ్స్ వల్ల చర్మ రంగులో మార్పు వస్తుంది. ఎల్లో కలర్ నుండి ఆరెంజ్ కలర్ లోకి మారుతుంది. అరచేతులు, ముఖం, చేతులు, పాదాల రంగులో మార్పు కనిపిస్తుంది. జ్యూస్ సెంటర్లలో విక్రయించే వారి వద్ద రుచి ప్రధాన అంశం కాబట్టి, కృత్రిమ రుచులను యాడ్ చేస్తుంటారు. ఇది క్యారెట్ జ్యూస్ ప్రయోజనాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు.. అన్‌పాశ్చరైజ్డ్ జ్యూస్‌లలో చిన్నపిల్లలకు, గర్భిణీలకు లేదా రోగనిరోధక శక్తి లేనివారికి హాని కలిగించే బ్యాక్టీరియా ఉండవచ్చు. క్యారెట్ జ్యూస్‌ని ప్రాసెస్ చేయడానికి కొన్ని రసాయనాలు వాడుతుంటారు. అలాంటివి ఆరోగ్యకరమైన జ్యూస్ ప్రయోజనాన్ని దెబ్బతీస్తాయి. కానీ ప్రాసెస్ చేసిన రసాలలో తరచుగా సువాసన కోసం జోడించిన చక్కెరలు ఉంటాయి. దీనివల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు సమస్యలు తలెత్తుతాయి. అలాగే, చిన్న పిల్లలకు క్యారెట్ ఎక్కువగా పెట్టడం సురక్షితం కాదు, అందువల్ల చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే పిల్లలకు అందివ్వాలి. అలాగే జ్యూస్ చేసేటప్పుడు ఇందులో అత్యంత పోషకమైన ఫైబర్ మొత్తాన్ని కోల్పోతాము.

# చూడడానికి చిన్నకాయు అయినా... పోషకాలలో మాత్రం మిన్న..!




సీజన్ లతో సంబంధం లేకుండా ప్రతి సీజన్‌లోనూ దొరికే కూరగాయల్లో దొండకాయ ఒకటి. దొండకాయను రకరకాల కూరలు ఉపయోగిస్తుంటారు. కానీ కొందరు మాత్రం దొండకాయను తినడానికి అస్సలు ఇష్టపడరు. కానీ దొండకాయలని సుగుణాలు తెలిస్తే అసలు అలా చేయలేరు. ఎందుకంటే మరెన్నో అనారోగ్య సమస్యలను సైతం దూరం చేస్తుంది. అస్సలు దొండకాయ తింటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చో ఇప్పుడు మనము తెలుసుకుందాం పదండీ.. ఈ మధ్యకాలంలో ప్రతి పదిమందిలోనూ ఆరు మంది డయాబెటిస్తో బాధపడుతూ ఉన్నారు అలాంటి వారు దొండకాయ తింటే చాలా మంచిదని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే, రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్ ని తగ్గించడంలో దొండకాయ అద్భుతంగా పనిచేస్తుంది. వీరు వారానికి రెండు సార్లనా దొండకాయను వారి ఆహారంలో చేసుకోవడం ఉత్తమం. ఇలా తరచూ దొండకాయలు తీసుకోవడం వల్ల ఇందులో అధికంగా ఉన్న క్యాల్షియమ్, మెగ్నీషియమ్ వంటి పోషకాలు పుష్కళంగా అంది, ఎముకలు, దంతాలు దృఢంగా మారతాయి. మరియు ఇందులో ఉన్న ఆంటీ బ్యాక్టీరియాల్ గుణాలు, విటమిన్ సి మన శరీరంలో రోగనిరోధకశక్తిని పెంచుతాయి. ఎందుకంటే మనం శరీరంలో రోగనిరోధక శక్తి ఉంటేనే కరోనా వైరస్ మరియు మామూలు సీజనల్ రోగాలకు దూరంగా ఉండవచ్చు. ఈ కాయలను ఫైబర్ కూడా అధికంగా లభిస్తుంది. కావున దొండకాయను తరుచూ తీసుకోవడంతో జీర్ణ సమస్యలు నయం అవ్వడంతో పాటు, మలబద్ధకం ,గ్యాస్, అజీర్తి వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది. ఇందులో ఉండే అధిక పొటాషియం వల్ల రక్త ప్రసరణ సక్రమంగా జరిగి, గుండె ఆరోగ్యం మెరుగ్గా తయారవుతుంది. బరువు తగ్గాలనుకునే వారు ఇది మంచి ఆహారమని చెప్పవచ్చు. అదికాక శరీరంలో ఉన్న చెడు కొవ్వు కరుగుతుంది.

# గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉండాలా..



ప్రెగ్నెన్సీ టైమ్ మహిళలకు సవాళ్లతో కూడుకున్నది. ఈ సమయంలో వారు తమను తాము మాత్రమే కాకుండా కడుపులో ఉన్న బిడ్డను కూడా చూసుకోవాలి. గర్భధారణ సమయంలో మహిళలు ఆహారపు అలవాట్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఆరోగ్య నిపుణులు ఎల్లప్పుడూ సలహా ఇస్తుంటారు. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా మహిళలు గర్భధారణ సమయంలో అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని చెబుతారు. గర్భిణీ స్త్రీలు తమ ఆహారంలో ఏది తింటే కడుపులో ఉన్న బిడ్డకు కూడా పోషకాహారం అందుతుందో నిపుణులు సూచిస్తుంటారు. మహిళలు తమ ఆహారంలో పండ్లు, కూరగాయలతో పాటు పప్పులను కూడా తీసుకోవచ్చు. దీంతో వారికి ప్రొటీన్‌తో పాటు అన్ని రకాల పోషకాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు. పెసరు పప్పు..: పప్పు ధాన్యాల్లో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది. ఈ జాబితాలో పెసరు పప్పు కూడా ఉంది. గర్భధారణ సమయంలో స్త్రీ దీనిని తింటే ఆమె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. విశేషమేమిటంటే ఇందులో కొవ్వు తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల మలబద్ధకం సమస్యలు నయమవుతాయి. మసూర్ పప్పు: మసూర్ పప్పులో ఐరన్ పుష్కలంగా లభిస్తుంది.

# రాత్రిపూట డిన్నర్ మానేస్తున్నారా........!




ఈ మధ్యకాలంలో బిజీ లైఫ్ స్టైల్ లేదా ఇతర సమస్యల వల్ల బరువు పెరగడం లేదా ఊబకాయం బారిన ఎక్కువగా పడుతున్నారు. అధిక బరువు పెరగడం వల్ల మన శరీరం వ్యాధులకు నిలయంగా మారుతుంది. ఊబకాయం కారణంగా మధుమేహం, హైబీపీ, కొలెస్ట్రాల్ వంటి అనేక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కొంతమంది ఊబకాయాన్ని సాధారణ సమస్యగా భావిస్తారు. మరికొంతమంది మాత్రం ఈ సమస్య నుంచి బయటపడేందుకు చూస్తుంటారు. దానికోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. కొన్ని ప్రయత్నాలతో బరువు తగ్గినా భవిష్యత్తులో వారికి సమస్యగా మారుతుంది. అలాంటి ప్రయత్నాల్లో రాత్రి పూట భోజనం చేయకపోవడం కూడా ఒకటి. బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం మానేస్తారు. దీని కారణంగా శరీరంలో పోషకాల లోపం ఉంటుంది. రాత్రిపూట భోజనం మానేయడం వలన అనేక సమస్యలు ఎదురవుతాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆ సమస్యలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రజలు రాత్రిపూట ఆహారం తీసుకోకపోవడం ఆరోగ్యానికి మంచిదని భావించినా దాని వల్ల అనేక నష్టాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు డైటీషియన్లు. అధిక బరువుతో బాధపడుతున్నవారు కొన్ని నెలల పాటు రాత్రి భోజనం చేయకుండా ఉంటే చాలని, సంవత్సరాల తరబడి దీనిని అనుసరించాల్సిన అవసరం లేదంటున్నారు. ఎక్కువ కాలం రాత్రిపూట ఆహారం మానేయడం వల్ల శరీరంలో పోషకాల లోపం కూడా ఏర్పడుతుంది.

# సరిగా ఉడకని అన్నం తినడం ఎంత ప్రమాదకరమో తెలుసా...?




మన భారతదేశం అంటే వ్యవసాయ ఆధారిత దేశం. మన దేశంలో ఎక్కువగా వరి ఇంకా గోధుమ పండిస్తారు. ఇందులో చాలామంది కూడా అన్నం ఆహారంగా తీసుకుంటారు. కొంతమంది రోజులో త్రీ టైమ్స్ అన్నమే తింటే మరికొందరు ఉదయం టిఫిన్, చేసి, మధ్యాహ్నం, రాత్రి రైస్ తింటుంటారు. ఇక అన్నం లో ఎక్కువ మొత్తంలో కార్బోహైడ్రేట్స్ అనేవి ఉంటాయి. ఇక ఇవి శరీరానికి కావల్సిన శక్తిని బాగా అందిస్తాయి. అయితే అన్నం ఎవరయినా వండుకుంటారు. కొందరు గ్యాస్, కుక్కర్లో వంట చేసుకుంటే మరికొందరు పొయ్యి మీద వంట చేసుకొని తింటారు. ఇక అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదే అయినా కొన్ని విషయాల్లో జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు అవి ఏంటో ఇప్పుడు తెల్సుకుందాం. ఇక ఈ రోజులో మనం తినే ఆహారాలు ఎక్కువగా అనేక రసాయనాలతో నిండి ఉంటున్నాయని అందరికి తెలుసు. మన జీవనశైలిలో మనకు తెలియకుండానే ఈ హానికరమైన రసాయనాలను మనం తీసుకుంటున్నాం.

# ఏ వైపు తిరిగి పడుకోవడం మంచిది



నిద్ర ఆరోగ్యానికి చాలా మంచిది. మానవ శరీరంలో నిద్ర అనేది కీలక పాత్ర పోషిస్తుంది. ఒక వ్యక్తి తప్పనిసరిగా ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి అంటారు వైద్యులు. అయితే కొంత మంది తమ వర్క్ బిజీ లైఫ్‌లో సరిగా నిద్రపోవడం లేదు. మరికొంత మంది మానసికంగా ఇబ్బందులు ఎదుర్కోవడం వలన నిద్రపోవడం లేదు. ఇంకొంత మంది స్మార్ట్ ఫోన్‌కు బానిసై నిద్రకు భంగం కలిగిస్తున్నారు. కానీ సరైన సమయంలో నిద్రపోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే కొంత మందికి పడుకున్నాక అస్సలే నిద్ర పట్టదు. ఏ వైపు తిరిగి పడుకోవాలో కూడా తెలియదు. కాగా, దాని గురించే ఇప్పుడు తెలుసుకుందాం. ఏ వైపు తిరిగి పడుకోవడం వలన ఆరోగ్యం బాగుంటుంది. అలాగే త్వరగా నిద్రపడుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అంటున్నారు వైద్యులు. ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన జీర్ణక్రియ బాగుంటుందంట. ఎడమవైపు నిద్రిస్తున్నప్పుడు మీ కడుపు, ప్యాంక్రియాస్ యొక్క స్థానం మెరుగైన డ్రైనేజీని అనుమతిస్తుంది. ఇది యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ప్రస్తుతం చాలా మంది మహిళలు సంతానలేమి సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు ఎడమ వైపు తిరిగి పడుకోవడం చాలా మంచిదంట. అంతే కాకుండే వెన్ను నొప్పితో బాధపడేవారు ఎడమవైపు తిరిగి పడుకోవడం మరీ మంచిదంట. ఇలా ఎడమవైపు తిరిగి పడుకోవడం వలన గుండె పనితీరు కూడా బాగుంటుంది అంటున్నారు నిపుణులు. మీ ఎడమ వైపున పడుకోవడం వల్ల మీ గుండె పై ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రక్త ప్రసరణను మెరుగుపడుతుంది.


# పదే పదే పొత్తికడుపులో నొప్పి వస్తుందా......!



పొత్తికడుపులో నొప్పి అనేది చాలా సహజం. అయితే ఇది కొన్నిసార్లు కామన్‌గా ఉండొచ్చు, కానీ ఇది అధికమైతే మన జీవితాన్ని అనేక సమస్యల్లోకి నెట్టేసే అవకాశం ఉన్నదంటున్నారు వైద్యులు. పొత్తికడుపు నొప్పి అనేది అనేక రకాల సమస్యల వలన వస్తుందంట. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 1. పొత్తి కడుపు నొప్పి అనేది క్యాన్సర్‌కు సంకేతం అంటున్నారు వైద్యులు. కొన్ని రకాల క్యాన్సర్స్ పొత్తికడుపులో నొప్పిని కలుగజేస్తాయంట. అందువలన ఈ నొప్పి అనేది పదే పదే రావడం, గంటల తరబడి నొప్పిగా ఉన్నట్లు అనిపిస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలంట. 2. అపెండిక్స్ అనేది కామన్ సమస్య. పెద్ద పేగులో ఉండే చిన్న సన్ని గొట్టం ఎర్రబడినప్పుడు ఈ సమస్య వస్తుంది. అయితే ఈ అపెండిక్స్ సమస్య ఉన్నప్పుడు కూడా పొత్తికడుపులో నొప్పి వస్తుందంట. 3. ప్రస్తుతం చాలా మంది యూత్, వృద్ధులను అధికంగా వేధిస్తున్న సమస్య మలబద్ధకం. ఈ సమస్య ఉన్నవారికి కూడా పొత్తి కడుపులో నొప్పి వస్తుందంట. 4. గ్యాస్ , అసిడిటీ సమస్యలకు పొత్తికడుపు నొప్పి కూడా కారణం కావచ్చునంట.

## భార్య ఉపాసనకు రామ్ మసాజ్ వైరల్‌గా మారిన వీడియో

మెగా కోడలు ఉపాసన కాళ్లకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మసాజ్ చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన వారంతా.. ఈ సామెతనే గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్ తన భార్య ఉపాసనతో కలిసి అంబానీ ఇంట పెళ్లికి హాజరైన విషయం తెలిసిందే. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరిగిన అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో రామ్ చరణ్, ఉపాసనలతో పాటు పలువురు సెలబ్రిటీలు సందడి చేశారు. అంతకు ముందు ఈ వేడుకకు హాజరయ్యేందుకు ఎన్టీఆర్




దంపతులతో కలిసి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో దర్శనమిచ్చారు చరణ్ దంపతులు. ఎన్టీఆర్ దంపతులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఈవెంట్‌కు హాజరు కాగా, చరణ్ దంపతులు ఇలా అంబానీ ఇంట జరిగిన ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ లో సందడి చేశారు. ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో చరణ్‌తో కలిసి ఉపాసన వెళుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమయంలోనే.. తాజాగా ఈ మసాజ్ వీడియో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఉపాసన ఇటీవలే ఓ బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో అలసిపోయిన ఉపాసనకు చరణ్ ఇలా మసాజ్ చేస్తూ కనిపించారు. చరణ్ మసాజ్ చేస్తుంటే.. ఉపాసన హాయిగా నిద్రపోతున్నారు. ఈ వీడియో చూసిన వారంతా భార్య పట్ల రామ్ చరణ్ చూపిస్తున్న కేరింగ్ చూసి వావ్ అంటున్నారు. ఎంతటి స్టార్ అయినా భార్య కాళ్లు పట్టాల్సిందే అంటూ కొంతమంది సరదాగా కామెంట్స్ వేస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.




## త్వరలోనే జై హనుమాన్ ఫస్ట్‌లుక్

త్వరలోనే 'జై హనుమాన్' ఫస్ట్‌లుక్ విడుదల చేయబోతున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు. సంక్రాంతి కానుకగా వచ్చిన 'హనుమాన్' మూవీ 150 థియేటర్‌లలో 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర బృందం 'హిస్టారికల్ 50 డేస్' కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో ఓ సినిమాకు సంబంధించి 50 రోజుల కార్యక్రమం జరిగి చాలా రోజులైంది. ఇన్నేళ్ల తర్వాత 'హనుమాన్'కు జరగడం సంతోషంగా ఉంది. ఒక సినిమా విజయం చాలా మంది జీవితాలను మారుస్తుంది. 'హనుమాన్' మా మొత్తం టీమ్‌కు పేరు తెచ్చింది. ఒకప్పుడు ఇలాంటి కార్యక్రమాలను సినిమా ప్రమోషన్స్ కోసం చేసేవాళ్లు. తమ మూవీ వారం రోజులు ఆడి, పెట్టిన డబ్బులు వస్తే చాలులే అనుకుంటున్న ఈ రోజుల్లో 50 రోజుల ఫంక్షన్ చేయడం చాలా మంది నిర్మాతల్లో నమ్మకాన్ని తీసుకొస్తుంది. ఎంతో మంది స్ఫూర్తి పొందుతారు. నా మొదటి సినిమా 'అ!' మంచి విజయాన్ని అందుకుని, విమర్శకులను సైతం మెప్పించింది. ఆ సమయంలో ఇలాంటి వేడుక చేయలేకపోయాం. ఆ మూవీ కమర్షియల్‌గా హిట్ కాలేదని చాలా మంది అనుకున్నారు. 'హనుమాన్' రీమాస్టర్ వెర్షన్ తీసుకొస్తున్నాం. అది ఇంకా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ప్రశాంత్ సినిమాటిక్ యూనివర్స్‌కి ఈ మూవీ మంచి పునాది వేసింది. మీరిచ్చిన ప్రోత్సాహంతో క్వాలిటీ సినిమాలు చేస్తాం. సినిమా విడుదలైన దగ్గరి నుంచి మేము అస్సలు పార్టీ చేసుకోలేదు. అంతర్జాతీయంగానూ ఈ మూవీని ఎలా తీసుకువెళ్లాలా? అని ప్రయత్నాలు చేశాం. స్పెయిన్, జపాన్, చైనా డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడాం. వాళ్లకూ ఈ మూవీ నచ్చింది. త్వరలోనే విడుదల చేస్తున్నాం. ప్రపంచదేశాల్లో తెలుగు మూవీ గొప్పతనాన్ని 'హనుమాన్' చాటబోతోంది"జై హనుమాన్'కు సంబంధించిన పని మొదలైంది. త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తాం. ఇందులో హనుమంతుడే హీరో. 'హనుమాన్' క్లైమాక్స్ ఏవిధంగానైతే విపరీతంగా నచ్చిందో కొత్త మూవీ రెండున్నర గంటల పాటు అదే థ్రిల్, జోష్‌తో ఉంటుంది. కచ్చితంగా మీరు గర్వపడేలా సినిమా తీస్తా. మీరు అందించిన విజయాన్ని బాధ్యతగా తీసుకుని, 'జై హనుమాన్' తీర్చిదిద్దుతా' అని ప్రశాంత్ వర్మ అన్నారు.

## శశివదనే చిత్రం నుంచి పాట విడుదల

'పలాస 1978'లో అద్భుతమైన నటనతో అందరి ప్రశంసలు అందుకున్న రక్షిత్ అట్లూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'శశివదనే'. కోమలి ప్రసాద్ కథానాయికగా నటిస్తోంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేని దైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అంటూ హృదయాన్ని హత్తుకునే గ్రామీణ నేపథ్యంలో ప్రేమ కథాంశంగా తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 5న గ్రాండ్ రిలీజ్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ పాటలు, టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి 'ఏమిటో ఏమిటో..' అనే పాటను విడుదల చేశారు. హీరోయిన్‌పై మనసుపడ్డ హీరో తన మనసులో చేలరేగె భావాలను పాట రూపంలో వ్యక్తం చేసే క్రమంలో పాట వచ్చే సందర్భంగా అనిపిస్తోంది. అదేంటో తెలుసుకోవాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే అంటున్నారు దర్శక నిర్మాతలు. పి.వి.ఎన్.ఎస్.రోహిత్ పాడిన ఈ పాటను కరుణాకర్ అడిగర్ల రాశారు. శరవణ వాసుదేవన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. ÷బిరీ నాయుడు సమర్పణలో ంఉ ఫిల్మ్ కంపెనీ, ÷ూ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ (ంతిబిఃతీజీ ౖగ÷÷జీపీనీనిటజీ), అభిలాష్ రెడ్డి గోదాల ఈ చిత్రాన్ని నిర్మించారు. రైటర్, డైరెక్టర్ సాయి మోహన్ ఉబ్బన సినిమాను తెరకెక్కించారు. ఇప్పటి వరకు వచ్చిన మూవీ కంటెంట్‌తో.. ఈ ప్రేమకథా చిత్రంలో గోదావరి జిల్లాల అందాలను ఎలా చూపించబోతోన్నారు అనే దానిపై ఓ స్పష్టత వచ్చింది. ఈ చిత్రంలో రంగస్థలం మహేష్, శ్రీమాన్, జబర్దస్త్ బాబీ, ప్రవీణ్ యండమూరి మరియు దీపక్ ప్రిన్స్ కీలక పాత్రలు పోషించారు.






## భర్త విఘ్నేష్‌ను అన్‌ఫాలో చేసిన నయనతార

దక్షిణాదిన అగ్రనటీమణుల్లో వెలుగొందుతున్న నయనతార సామాజిక మాధ్యమాల్లో ఈమధ్యనే అరంగేట్రం చేశారు. ఆమె తన కవల పిల్లల ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్ లో మొదటి పోస్టుగా పెట్టి జాయిన్ అయ్యారు. ఆ తరువాత ఆమెకి వందల, వేల, లక్షల మంది అభిమానులు ఫాలో అవటం మొదలెట్టారు. ఈరోజు ఆమెకి ఇన్‌స్టాగ్రామ్ లో 78 లక్షల మంది ఫాలోవర్స్ (7.8 మిలియన్) వున్నారు. ఇప్పుడు నయనతార వార్తల్లో వున్నారు. ఎందుకంటే ఆమె తన భర్త విఘ్నేష్ శివన్ ని ఇన్‌స్టాగ్రామ్ లో అన్ ఫాలో చేశారు. ఎందుకు అలా చేశారో ఎవరికీ తెలియదు కానీ నయనతార అభిమానులు మాత్రం ఈ విషయంపై రకరకాలుగా చర్చించు కుంటున్నారు. అదేదో పొరపాటున అలా అయింది అని అదేమంత పెద్ద విషయం కాదని ఇలా అనుకుంటున్నారు. కొందరైతే సాంకేతిక కారణాలు ఉండొచ్చు అని కూడా అంటున్నారు. ఇలా ఎవరికీ వారు అనుకుంటున్నా, నయనతార ఇన్‌స్టాగ్రామ్ లో మాత్రం ఆమె తన భర్తని ఫాలో అవుతున్నట్టు మళ్ళీ చూపిస్తోంది. ఏదైనా సాంకేతిక లోపం వలన కొన్ని గంటలపాటు అన్ ఫాలో అయినట్టు కనిపించక పోవచ్చు అని కూడా అంటున్నారు. పని పరంగా చూస్తే నయనతార ఈమధ్యనే షారుఖ్ ఖాన్ తో నటించిన హిందీ సినిమా 'జవాన్' చాలా పెద్ద విజయం సాధించింది. ఇప్పుడు 'టెస్ట్' అనే సినిమాలో నటిస్తున్నారు, ఇందులో మాధవన్, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ఇతర పాత్రల్లో కనిపిస్తున్నారు. శశికాంత్ ఈ సినిమాకి దర్శకుడు.


## దేశభక్తితో తెరకెక్కిన చిత్రం ఆర్టికల్ 370 యామీ గౌతమ్ వెల్లడి




యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో ఆదిత్య సుహాస్ జంభాలె తెరకెక్కించిన చిత్రం 'ఆర్టికల్ 370' ఫిబ్రవరి 23న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాపై కొన్ని దేశాలు నిషేధం విధించడం చర్చనీయాంశం అయిన విషయం తెలిసిందే. కొన్ని సన్నివేశాలు ఆందోళనకరమైన ధోరణిలో ఉన్నాయని అందుకే నిషేధించినట్టు సమాచారం. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వార్తలపై స్పందించిన యామీ గౌతమ్ 'ఆర్టికల్ 370' దేశంపై ఉన్న భక్తితో తెరకెక్కించిన సినిమా అని తెలిపారు. 'సినిమా చూడకుండానే తీర్పు చెప్పేవారు ఉంటారు. కానీ ఆర్టికల్ 370 నిషేధాన్ని మేము ఊహించలేదు. ఇందులో ఆందోళనకరమైన సన్నివేశాలు లేవు. ప్రేరణ కలిగించే వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. మంచి సినిమా చూసి ఇంటికి వెళ్తున్నామన్న అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. అది మా చిత్రబృందానికి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. సినిమా చూశాక తీర్పు చెప్పాలి కానీ ముందే ఎలా ఓ నిర్ణయానికి వస్తారు? ఈ సినిమా కశ్మీర్ అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రచారం కోసం చేసింది కాదు' అని యామీ గౌతమ్ వెల్లడించారు. కశ్మీర్‌లో జరిగిన పరిస్థితుల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో యామీగౌతమ్ ఇంటెలిజెన్స్ ఏజెంట్‌గా యాక్షన్ అవతారంలో నటించారు. ప్రియమణి కీలక పాత్రలో కనిపించారు. ఈ సినిమా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.

# దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గుముఖం

**న్యూఢిల్లీ :** దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఏప్రిల్–డిసెంబర్‌లో 13 శాతం క్షీణించి 32.03 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అంతకుముందు ఏడాది (2022) ఇదే వ్యవధిలో 36.74 బిలియన్ డాలర్లుగా ఉండటం గమనార్హం. అయితే 2023 అక్టోబర్–డిసెంబర్‌లో ఎఫ్‌డీఐ గతంతో పోల్చితే 18 శాతం పెరిగి 11.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022 అక్టోబర్–డిసెంబర్‌లో 9.83 బిలియన్ డాలర్లే. కానీ ఏప్రిల్–జూన్, జూలై–సెప్టెంబర్ త్రైమాసికాల్లో క్షీణత ప్రభావితం చేసినట్టు తాజా ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. అధిక వడ్డీరేట్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా ఎఫ్‌డీఐ పతనానికి కారణమేనన్న అభిప్రాయాలు ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐ 22 శాతం పడిపోయి 46 బిలియన్ డాలర్లుగానే ఉన్న విషయం తెలిసిందే. కంప్యూటర్ హార్డ్‌వేర్–సాఫ్ట్‌వేర్, ట్రేడింగ్, సేవలు, టెలికం, ఆటో, ఔషధ, రసాయన రంగాల్లో ఎఫ్‌డీఐలు దిగజారినట్టు తేలింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి, విద్యుత్తు రంగాల్లోకి ఎఫ్‌డీఐ పెరిగినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే క్షీణత నమోదైనట్టు పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) చెప్తున్నది. ఇదిలావుంటే నిరుడు ఏప్రిల్–డిసెంబర్‌లో ఈక్విటీ మార్కెట్లు, ఇతరత్రా 3.6 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. ఢిల్లీ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలూ ఎఫ్‌డీఐలను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి.





# బయోఏషియా 2024లో మెరిసిన క్వీన్స్‌లాండ్

క్వీన్స్‌లాండ్ ప్రభుత్వ అంకితమైన వ్యాపార సంస్థ అయిన ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ క్వీన్స్‌ల్యాండ్ (టీ–ఐక్యూ), బయోఏషియా 2024కి గ్లోబల్ స్పాన్సర్‌గా పాల్గొనడం ద్వారా పొందిన అద్భుతమైన ప్రతిస్పందనను వెల్లడించింది. లైఫ్ సైన్సెస్ పరిశ్రమ, ఆరోగ్య సంరక్షణ రంగంలోని ఇతర కంపెనీలతో చర్చలు, సంభావ్య భాగస్వామ్యాలను అన్వేషించడం కోసం ఈ సదస్సు తోడ్పడింది. టీ–ఐక్యూ నేతృత్వంలో, 8 మంది క్వీన్స్‌ల్యాండ్ పరిశోధకులు, కంపెనీల ప్రతినిధి బృందం సదస్సులో పాల్గొంది. ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ క్వీన్స్‌ల్యాండ్ దక్షిణాసియా సీనియర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమీషనర్ అభినవ్ భాటియా మాట్లాడుతూ... బయోఏషియా 2024లో తమ భాగస్వామ్యం ఉమ్మడి పరిశోధన, మొదటి దశ క్లినికల్ ట్రయల్స్, ఉమ్మడి ఔషధ ఆవిష్కరణల ద్వారా ప్రపంచ భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో క్వీన్స్‌లాండ్ అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.




# జిడిపికి రెక్కలు!




మరికొన్ని రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు అనుహ్యాంగా జిడిపి అమాంతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) ఏకంగా 8.4 శాతం పెరిగినట్లు కేంద్ర గణంకాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్‌ఎస్ఒ) ప్రకటించింది. గురువారం వెల్లడించిన ఈ గణంకాలు ఆర్‌బిఐ అంచనాల కంటే ఎక్కువగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆర్‌బిఐ సహా అనేక అంతర్జాతీయ, జాతీయ ఎజెన్సీలు, విత్త సంస్థలు భారత వృద్ధి రేటు 7 శాతం దిగువన ఉండొచ్చని ఇంతక్రితం అంచనా వేశాయి. డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి 6.5 శాతానికి పరిమితం కావొచ్చని ఆర్‌బిఐ ఇటీవల పేర్కొంది. ఈ అంచనాలకు భిన్నంగా ప్రధాని మోడీ ప్రభుత్వ గణంకాలు ఉండటం గమనార్హం. 2011–12 స్థిర ధరలతో పోల్చితే గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి విలువ రూ.43.72 లక్షల కోట్లకు పెరిగింది. 2022–23 ఇదే త్రైమాసికంలో రూ.40.35 లక్షల కోట్లుగా ఉందని.. దీంతో పోల్చితే 8.4 శాతం పెరుగుదల నమోదయ్యిందని ఎన్‌ఎస్ఒ వెల్లడించింది. 2023–24లో 7.6 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని ఎన్‌ఎస్ఒ తాజా అంచనాల్లో పేర్కొంది. కాగా.. 2022–23లో తొలుత ప్రకటించిన 7 శాతం వృద్ధిని.. 7.2 శాతానికి పెంచి సవరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో భారత జిడిపి 7.8 శాతం, జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికంలో 7.6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో నిర్మాణ రంగం ఏకంగా 10.7 శాతం పెరుగుదలను నమోదు చేసినట్లు ఎన్‌ఎస్ఒ చూపించింది. తయారీ రంగం 8.5 శాతం పెరిగింది. రేటింగ్ ఎజెన్సీలు, దిగ్గజ విత్త సంస్థల పరిశోధన సంస్థల అంచనాను మించి జిడిపి పెరుగుదల చోటు చేసుకోవడం నిపుణులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

# టాటా చిప్ తయారీ ప్లాంట్లు వస్తున్నాయ్!





**న్యూఢిల్లీ :** కొవిడ్ సమయంలో సెమీకండక్టర్ చిప్‌ల కొరత వల్ల ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఎంతో ఇబ్బంది పడింది. చిప్‌ల వాడకం తప్పనిసరి కావడంతో, అవి లభించక వాహనాల తయారీ కూడా నెమ్మదించింది. ఈ పరిస్థితి మళ్లీ ఎదురవ్వకుండా, దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ విపణులకూ అందించేందుకు మనదేశంలో 3 సెమీకండక్టర్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు గురువారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందులో టాటా గ్రూప్ 2 ప్లాంట్లు ఏర్పాటు చేయనుండగా.. జపాన్‌కు చెందిన రెనెసాస్ భాగస్వామ్యంతో సీజీ పవర్ ఒక ప్లాంటు నిర్మించనుంది. వీటి వల్ల మొత్తం రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. రూ.76,000 కోట్ల ప్రభుత్వ మద్దతు: రక్షణ, వాహన, టెలికమ్యూనికేషన్ రంగాల కోసం చిప్ సెట్లను తయారు చేసే ఈ మూడు ప్లాంట్ల నిర్మాణం వచ్చే 100 రోజుల్లో ప్రారంభమవుతుందని టెలికాం మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 'డెవలప్‌మెంట్ ఆఫ్ సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్' పథకం కింద ఏర్పాటయ్యే ఈ ప్లాంట్లకు ప్రభుత్వం నుంచి రూ.76,000 కోట్ల మద్దతు లభిస్తుంది. టాటాలు.. 2 ప్లాంట్లు: తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కార్ప్ భాగస్వామ్యంతో, టాటా గ్రూప్‌నకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ ఒక సెమీకండక్టర్ ఫ్యాబ్‌ను గుజరాత్‌లోని ఢొలేరాలో ఏర్పాటు చేయనుంది. నెలకు 50,000 వేఫర్ల తయారీ సామర్థ్యం దీని సొంతం. ఈ ప్లాంటుపై రూ.91,000 కోట్ల పెట్టుబడులు పెడతారు. 28 ఎన్ఎమ్ టెక్నాలజీతో అత్యుత్తమ పనితీరును అందించే చిప్‌లను ఇక్కడ తయారు చేస్తారు. వీటిని విద్యుత్తు వాహనాలు, టెలికాం, రక్షణ ఆటోమోటివ్, వినియోగదారు ఎలక్ట్రానిక్స్, డిస్‌ప్లే, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో వినియోగిస్తారు. టాటా సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.27,000 కోట్లతో అస్సాంలోని మారిగావ్‌లో సెమీకండక్టర్ ప్లాంటును ఏర్పాటు చేస్తుంది. ఇక్కడ రోజుకు 4.8 కోట్ల చిప్‌లు తయారవుతాయి.

# కాగ్నిజెంట్ సంస్థ.. హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఆస్తులు అమ్ముకోనుందా......?




**హైదరాబాద్ :** టాప్ టెక్ కంపెనీల్లో ఒకటైన కాగ్నిజెంట్ అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నది. సాధారణంగా కాస్ట్ కటింగ్ పేరిట టెక్ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తూ ఖర్చును తగ్గించుకుంటాయి. అయితే, కాగ్నిజెంట్ మాత్రం ఉద్యోగాల్లో కోత విధించడంతోపాటు ఆస్తులను కూడా విక్రయించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంస్థ హైదరాబాద్, చెన్నైలోని తన ఆస్తులను విక్రయించడానికి సిద్ధంగా ఉందని కొన్ని మీడియా కథనాల చెబుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం.. రెండేళ్లలో రూ.3,300 కోట్లను ఆదా చేసే లక్ష్యంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని 10 ఎకరాల క్యాంపస్‌ను, చెన్నై సిరుసేరిలోని 14 ఎకరాల క్యాంపస్‌ను విక్రయించాలని కాగ్నిజెంట్ యోచిస్తున్నట్లు సమాచారం. రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా కాగ్నిజెంట్ తన వర్క్‌స్పేస్‌ను తగ్గించుకుని, వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడానికి హైబ్రిడ్ వర్క్ కల్చర్‌ను ఎంచుకుంది. టెక్ కంపెనీలు మారుతున్న వర్క్‌కల్చర్‌కు అనుగుణంగా హైబ్రిడ్ వర్క్ మోడల్‌ను అనుసరిస్తున్నాయి. వివిధ నగరాల్లోని కార్యకలాపాలను ఏకీకృతం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే కాగ్నిజెంట్ ఈ చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

# ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం...
## ఉద్యోగులు వారంలో 3 రోజులు ఆఫీసుకు రావాల్సిందే




దేశంలోనే రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఉద్యోగులు ఇకపై వారంలో మూడు రోజులు ఆఫీసుకు రావాలని ఆదేశించింది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇప్పటికే సంబంధిత విషయంపై ఉద్యోగులకు అంతర్గత ఈ–మెయిల్ ద్వారా తెలియజేసింది. 'దయచేసి వారంలో కనీసం 3 రోజులైనా ఆఫీసులకు రండి. అతి త్వరలోనే ఇది తప్పనిసరి కానుంది' అని ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో ఇన్ఫీ పేర్కొంది.

# ఆ రెండూ ఒకటైతే ధరల మోతే.. రిలయన్స్–డిస్నీ విలీనంతో మీడియా, వినోద రంగంపై ప్రతికూల ప్రభావం!

**న్యూఢిల్లీ :** భారతీయ మీడియా, వినోద రంగంపై రిలయన్స్–డిస్నీ విలీనం పెద్ద ఎత్తునే ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ వయకామ్18తో వాల్ట్ డిస్నీ దేశీయ మీడియా వ్యాపార కార్యకలాపాలు ఏకమవుతున్న విషయం తెలిసిందే. ఇదే జరిగితే దేశీయ మీడియా, వినోద రంగంలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతుందని, ఫలితంగా సబ్‌స్క్రైబర్లకు ఇప్పటిదాకా అందుతున్న తక్కువ చార్జీల ప్రయోజనాలు క్రమేణా దూరం కాగలవని ఈ రంగ నిపుణులు అంటున్నారు. వ్యాపారులు సైతం తమ వాణిజ్య ప్రకటనల కోసం బేరాలాడే శక్తిని కోల్పోవచ్చని, దీనివల్ల ప్రకటనల వ్యయం పెరిగి వినియోగదారులపై ఆ భారం పడవచ్చని చెప్తున్నారు. రిలయన్స్–డిస్నీ దేశీయ మీడియా కార్యకలాపాల విలీనంతో రూ.70,000 కోట్ల కొత్త సంస్థ




ఆవిర్భవించనున్నది. వచ్చే ఏడాది మార్చికల్లా కావాల్సిన అనుమతులు వస్తాయని అంచనా. ఇక ఇందులో ఓటీటీ మార్కెట్ బడా వేదికలైన జియో సినిమా, డిస్నీప్లస్‌హాట్‌స్టార్‌లతోపాటు స్టార్ గ్రూప్‌నకు చెందిన అన్ని చానళ్లు, టీవీ18 ఆధ్వర్యంలోని చానళ్లు ఉండనున్నాయి.

# లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు....!




**ముంబయి :** అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:36 గంటల సమయంలో సెన్సెక్స్ 421 పాయింట్ల లాభంతో 72,922 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 146 పాయింట్లు పుంజుకొని 22,128 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.86 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్–30 సూచీలో టాటా స్టీల్, ఎం అండ్ ఎం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, మారుతీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్, విప్రో, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు–డిసెంబరు త్రైమాసికంలో భారత జీడీపీ 8.4% వృద్ధి చెందింది.

# రైతుల డిమాండ్లపై ఆదేశాలు ఇవ్వలేం

న్యూఢిల్లీ: రైతుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించాలని, శాంతియుతంగా యాత్ర చేసుకోవడానికి వీలుగా అన్ని అడ్డంకులను తొలగించి దేశ రాజధానిలో సమావేశవ్వడానికి తగిన ఆదేశాలను ఇవ్వాలని కోరుతూ రైతుల తరఫున దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ప్రచా కేవలం వార్తాపత్రిక కథనాల ఆధారంగా ప్రచారం కోసం ఇటువంటి పిటిషన్ వేయడం తగదని పిటిషనర్‌ను సుప్రీంకోర్టు మందలించింది. ఇటువంటి విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఇదే తరహా పిటిషన్‌పై హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీచేసిందని జస్టిస్ సూర్యకాంత్, స్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. తాము ఎవరి పక్షాన మాట్లాడడం లేదని, ఇవి చాలా జఠిలమైన అంశాలని, పూర్తిగా పరిశోధన చేసిన తర్వాతే పిటిషన్ వేయాలని ధర్మాసనం సూచించింది. దీంతో ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోనున్నట్లు పిటిషనర్ తెలియచేశారు. రైతులకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను అన్‌బ్లాక్ చేయాలని, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని పిటిషనర్ తన పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు. సిక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అగ్నోస్టోస్ థియోస్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎటువంటి కారణంగా లేకుండానే రైతులను రాజధానిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, రాజ్యాంగంలోని 19(1)(డి) అధికరణ కింద ఏ పౌరుడైనా దేశంలోని ఏ ప్రాంతానికైనా స్వేచ్ఛగా ప్రయాణించే స్వేచ్ఛను ఇది హరించడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, మధ్య ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ ప్రభుత్వాలను, జాతీయ హానవ హక్కుల కమిషన్‌ను ప్రతివాదులుగా ఆయన తన పిటిషన్‌లో చేర్చారు.

# ఢిల్లీ మహిళలకు ప్రతినెలా రూ .1000




న్యూఢిల్లీ : ఢిల్లీ ఆప్ ప్రభుత్వం సోమవారం 202425 కు సంబంధించి బడ్జెట్ ప్రవేశ పెట్టింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్‌లో 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన' అనే కొత్త పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతినెలా రూ.1000 అందించనున్నట్టు ఢిల్లీ ఆర్థిక మంత్రి ఆతిశీ వెల్లడించారు. ఈ పథకం కోసం ప్రత్యేకంగా రూ .2000 కోట్లు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఢిల్లీలో ఓటు ఉండి, ఇతర పథకాల ద్వారా లబ్ధి పొందని మహిళలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, అలాగే ఆదాయ పన్ను చెల్లింపు దారులూ ఈ కొత్త పథకం ద్వారా లబ్ధి పొందలేరని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో వెలువడిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఢిల్లీలో 67,30, 371 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం రూ . 76,000 కోట్ల వార్షిక పద్దును అసెంబ్లీ ముందుంచారు. తమ ప్రభుత్వం రామరాజ్యం ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందిందన్నారు. ఈ బడ్జెట్‌లో బిజినెస్ బ్లాస్టర్స్ అనే పథకాన్ని విశ్వవిద్యాలయాలు, ఐటీఐలకు విస్తరిస్తున్నట్టు అతిశీ ప్రకటించారు. ఇప్పటివరకు దీన్ని స్కూళ్లలో మాత్రమే అమలు చేస్తున్నారు. జీ 20 సన్నాహాల్లో భాగంగా గత ఏడాది ప్రభుత్వం మొత్తం తొమ్మిది పథకాలను ప్రవేశ పెడుతూ రూ. 78,800 కోట్ల బడ్జెట్‌ను ప్రకటించింది. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈ మొత్తం వరుసగా రూ.75,800 కోట్ల బడ్జెట్‌ను ప్రకటించింది. గత ఏడాది ఆర్థిక శాఖ బాధ్యతలు చేపట్టిన ఆతిశీ తొలిసారి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆమె విద్యాశాఖ మాజీ మంత్రి మనీశ్ సిసోడియా, ఆరోగ్యశాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌ను గుర్తు చేసుకున్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు ఒక రూపునివ్వడంలో వారు విశేషంగా కృషి చేసినట్టు తెలిపారు. విద్యారంగానికి తాజా బడ్జెట్‌లో రూ. 16,396 కోట్లు కేటాయించారు. ఆరోగ్యశాఖకు రూ.8685 కోట్లు ప్రకటించారు. సాంఘిక సంక్షేమం, మహిళశిశు అభివృద్ధి , ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విభాగాలకు రూ.6216 కోట్లు, ఢిల్లీ జలబోర్డుకు రూ.7195 కోట్లు కేటాయించారు.

# ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలతో కెటిఆర్ భేటీ



హైదరాబాద్ : రానున్న ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణపైన చర్చించడానికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోమవారం తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న లోక్‌సభ ఎన్నికలు, ఎంఎల్‌సి ఉపఎన్నికపైన పార్టీలతో చర్చించారు. ఇప్పటికే ఒక స్థానిక సంస్థల ఎంఎల్‌సి నోటిఫికేషన్ విడుదల కాగా, సోమవారం నుంచి నామినేషన్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ ఎన్నికపైన చేపట్టాల్సిన కార్యాచరణపైన, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానంతో పాటు నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో అనుసరించాల్సిన వ్యూహాలపైన చర్చించారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పైన పార్టీ అధినేత కెసిఆర్ ఒక విస్తృతస్థాయి సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కెటిఆర్ తెలిపారు. ఎంఎల్‌సితో పాటు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పరిస్థితులను కెసిఆర్‌కు విజ్ఞప్తి చేస్తామని ఈ సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎంఎల్‌సి ఎన్నికలతో పాటు ఈ రెండు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయ అవకాశాలు బలంగా ఉన్నాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాత బూటక హామీలే ఇప్పటి "మోడీ గ్యారంటీలు" : ఉద్ధవ్ థాక్రే



ముంబై: పాలకవర్గం బీజేపీ గత ఎన్నికల నాటి బూటకపు హామీలే ఇప్పుడు ఎన్నికల ముందు "మోడీ గ్యారంటీలు" గా ప్రజలకు చూపిస్తోందని శివసేన (యుబిటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే సోమవారం ధ్వజమెత్తారు. నవీముంబైకి ఆనుకుని ఉన్న పాన్వెల్ బహిరంగ సభలో ఆయన బీజేపీపై విమర్శలు గుప్పించారు. మావల్ లోక్‌సభ ప్రస్తుత ఎమ్‌పిని శ్రీరంగ్ బర్నేను స్థానిక ఓటర్లు ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. మావల్ లోక్‌సభ నియోజక వర్గంలో పావెల్ ఒక భాగం. ఈ స్థానం నుంచి బర్నే 2019లో అవిభక్త శివసేన అభ్యర్థిగా గెలుపొంది, తరువాత షిండే నేతృత్వం లోని శివసేన వర్గంలో చేరారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతలు అనేక బూటకపు హామీలు గుప్పించారని, ఇప్పుడు అవే బూటకపు (జుమ్లా) హామీలు మోడీ గ్యారంటీలుగా తిరిగి ప్యాకేజీ చేశారని విమర్శించారు. పిఎం కేర్స్ ఫండ్ కింద కరోనా మహమ్మారి సమయంలో సేకరించిన నిధులను దేనికి ఖర్చు చేశారో స్పష్టం చేయడం లేదని విమర్శించారు.

# కేజ్రీవాల్ దాటవేతలు కుదరవు : బిజెపి



న్యూఢిల్లీ: లిక్కర్ స్కామ్ విషయంలో కేజ్రీవాల్ దాటవేతలు సాగవని బిజెపి ఎంపి మనోజ్ తివారీ విమర్శించారు. తొమ్మిదోసారి కూడా ఆయన ఇడి సమన్లను బేఖాతరు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇకపై ఆయనకు ఎటువంటి ఊరట కల్పించరాదని, చట్టన్యాయపరంగా తగు చర్యలు తీసుకోవల్సి ఉందని సోమవారం ఈ ఎంపి డిమాండ్ చేశారు. ఢిల్లీవాలాలకు ఆప్ నేత ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? ఇక ఇటువంటి చేష్టలు కుదరవని తెలిపారు. కాగా ఢిల్లీ బిజెపి అధికార ప్రతినిధి హరీష్ ఖురానా స్పందిస్తూ కేజ్రీవాల్‌కు చట్టం పట్ల కనీస గౌరవం లేదని రుజువు అయిందని విమర్శించారు. పలు సాకులతో విచారణకు రాకుండా ఉండాలని కేజ్రీవాల్ ఆలోచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో వర్చువల్‌గా విచారణకు వస్తానని చెప్పిన శాల్తీ ఇప్పుడే ఈ పని చేయవచ్చు కదా అని నిలదీశారు.

# వైద్యుడి నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఓ నిండు ప్రాణం బలి అయిన విషాదకర సంఘటన చోటు చేసుకుంది. వైద్యుడు సర్జరీలో చేస్తుండగా స్టాఫ్ పేషంట్ పరిస్థితి వివరించినప్పటికి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వైద్యుడు వచ్చే సరికి పేషంట్ ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట మండలం కోమటిచేనుకు చెందిన జాడి సంతోష్ (24) అనారోగ్యంతో శనివారం రాత్రి 8 గంటలకు మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం సమస్య తీవ్రంగా ఉందని, కానీ తాము వైద్యం అందించి వ్యాధి నయం అయ్యేలా చేస్తామని డాక్టర్ నమ్మబలికాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పేషంట్ అవస్థ ఎక్కువ అవడంతో డాక్టర్ వద్దకు వెళ్లగా డాక్టర్ సర్జరీలో ఉన్నాడు. సిబ్బందికి పరిస్థితి వివరించగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

# లంచం కేసుల్లో ప్రజాప్రతినిధులకు మినహాయింపు లేదు: సుప్రీం



ఢిల్లీ: లంచం కేసుల్లో చట్టసభ్యులకు మినహాయింపు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎంఎల్ఎ, ఎంపిలు అవినీతికి పాల్పడితే విచారణ ఎదుర్కొవాల్సిందేనని కోర్టు తీర్పు వెల్లడించింది. చట్ట సభల్లో ప్రశ్నలు అడిగేందుకు, ప్రసంగించేందుకు ఓటు వేసేందుకు లంచం తీసుకుంటే రక్షణ కల్పించలేమని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా 1998 నాటి తీర్పును ఉన్నత న్యాయస్థానం కొట్టేసింది. 2012లో జార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి కేసు దేశంలో పెను సంచలనం సృష్టించిన విషయం విధితమే. రాజ్య సభ ఎన్నికలలో ఆ పార్టీ శాసన సభ్యురాలు సీతా సోరెన్ ఒక పార్టీ అభ్యర్థికి ఓటు వేయడానికి లంచం తీసుకొని మరొకరికి ఓటు వేశారనే ఆరోపణలు రావడంతో సిబిఐ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలి కోరుతూ సీతా హైకోర్టు తలుపుతట్టారు. హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2019లో అప్పటి ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఎంపి, ఎంఎల్ఏలు చట్టసభల్లో అవినీతికి పాల్పడినప్పుడు వారిపై చర్యలు తీసుకోవచ్చా లేదా వారికి రక్షణ కల్పించాలా? అనే అంశంపై ఐదుగురు సభ్యుల గల రాజ్యాంగ ధర్మసనానికి సిఫార్సు చేసింది. పివి నరసింహరావు వర్సెస్ సిబిఐ కేసు విషయం సదర్భంగా సభలో చేసే ప్రసంగాలు, సభలో వేసే ఓట్లపై ఎంపిలకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులు గల దర్మాసనం తీర్పును వెల్లడించడంతో పాటు ఈ అంశాన్ని పున:పరిశీలించాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది.

ఎంఎల్ఎ, ఎంపిలు చట్ట సభల్లో అవినీతికి పాల్పడితే వారిని విచారించే విషయంపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. అవినీతికి పాల్పడితే పార్లమెంటరీ అధికారాల ద్వారా వారికి రక్షణ ఉండదని కోర్టు తెలిపింది. 1998లో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని 105, 194 అధికరణలకు విరుద్ధంగా ఉందని వివరించింది. లంచం తీసుకోవడం అనేది ప్రజాజీవితంలో విశ్వసనీయతను కోల్పోతుందని పేర్కొంది.

**ఈ కేసు ఎలా జరిగిదంటే?**

1993లో ప్రధాని పివి నరసింహారావు ప్రభుత్వం అవిశ్వాసాన్ని ఎదుర్కొవాల్సి వచ్చింది. ఆ సమయంలో జెఎంఎంకు చెందిన ఐదుగురు ఎంపిలు లంచాలు తీసుకొని అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్టు ఆరోపణలు వచ్చాయి. జెఎంఎం మద్దతుతో పివి ప్రభుత్వం అవిశ్వాసంలో నెగ్గింది. జెంఎంఎం ఐదుగురు ఎంపిలపై సిబిఐ కేసులు నమోదు చేసింది. ఈ కేసు సుప్రీం కోర్టు వరకు వెళ్లింది.

# యుఎఇ, బంగ్లాదేశ్ లకు 64,400 టన్నుల ఉల్లి ఎగుమతికి అనుమతి



న్యూఢిలీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), బంగ్లాదేశ్‌లకు 64,400 టన్నుల ఉల్లి ఎగుమతికి కేంద్రం నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్టు సంస్థ (ఎన్‌సిఇఎల్) ద్వారా అనుమతించింది. బంగ్లాదేశ్‌కు 50,000 టన్నులు, యుఎఇకి 14,400 టన్నుల ఉల్లి ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) నోటిఫికేషన్ ద్వారా వెల్లడించింది. డిజిఎఫ్‌టి వాణిజ్య మంత్రిత్వ విభాగం. దిగుమతులు, ఎగుమతుల వ్యవహారాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. ఉల్లి ఎగుమతులపై నిషేధం ఉన్నప్పటికీ, మిత్రదేశాల అవసరాల దృష్టా పరిమితంగా కేంద్రం ఎగుమతికి అనుమతిస్తుంది. గత ఏడాది డిసెంబర్ 8న ప్రభుత్వం ఉల్లి ఎగుమతులను నిషేధించింది. ఈ ఏడాది మార్చి 31 వరకు ఇది అమలులో ఉంటుంది. గృహావసరాలు పెరగడంతోపాటు ధరలను అదుపులో ఉంచడానికి ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

# పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే



హైదరాబాద్ : పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, సిపిఐ తోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం జక్కలొద్దిలో గుడిసెలు వేసుకున్న 2750 కుటుంబాలు వివిధ పార్టీల నుండి సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్. బాల మల్లేష్ పార్టీ కండువాలు కప్పి సిపిఐలోకి వారందరినీ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బూర్జువా పార్టీలు అధికారం కోసమే పని చేస్తాయని, ఆ పార్టీలకు ఎన్నికలపుడే ప్రజల సమస్యలు గుర్తుకు వస్తాయని అన్నారు. కానీ ఎర్రజెండా పార్టీలు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటాయని అన్నారు. దేశంలో వందేళ్లుగా అనేక త్యాగాలతో పునీతమై సజీవంగా ఉన్న పార్టీ సిపిఐ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వేలాది మంది త్యాగాలతో ప్రజల కోసమే పనిచేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం లక్షలాది మందిని సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ ది మాత్రమేనని అన్నారు. వరంగల్ లో ఎం.కాళిదాస్, హనుమకొండలో బి ఆర్ భగవాన్ దాస్ లాంటి నాయకులు పేదలను సమీకరించి గుడిసెలు వేయించారని గుర్తు చేశారు. సిపిఐ నాయకులు నిరంతరం పేదల గురించే ఆలోచిస్తారని, గాలి, నీరు, భూమి,ఆకాశం ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలమల్లేష్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని అన్నారు. అసెంబ్లీలో ఒక్క ఎమ్మెల్యే ఉన్నా ప్రజలందరి గొంతుకగా నిలిచారని, కార్మిక, శ్రామికుల గళాన్ని వినిపిస్తున్నారని అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులనే గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు దండు లక్ష్మణ్,సిరబోయిన కరుణాకర్ అక్కపెల్లి రమేష్, సంగి ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సమంత



హైదరాబాద్ : ప్రముఖ హీరోయిన్ సమంత శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శన సమయంలో ఆలయంలోకి చేరుకున్న సమంతకు, అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు సమంతను ఆశీర్వదించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సమంతను చూసిన అభిమానులు దగ్గరకు వచ్చి పలకరిస్తూ, ఆమెతో ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. అదేవిధంగా సమంతతో పాటు శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అందులో తెలుగు సినిమా క్యారెక్టర్ ఆర్టిస్ట్ రమ్యశ్రీ, మరో యాక్టర్ నాగ మహేశ్, కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి ఉన్నారు.

## అమరజవాన్ల కుటుంబాలకు ఢిల్లీ సర్కార్ రూ. 1 కోటి పరిహారం

న్యూఢిల్లీ: గత తొమ్మిదేళ్లలో దేశం కోసం ప్రాణాలర్పించిన 35 మంది అమరవీరుల కుటుంబాలకు, కరోనా మహమ్మారి కాలంలో ప్రజలకు సేవలందచేసే క్రమంలో వైరస్‌బారిన పడి మరణించిన 92 మంది కొవిడ్ వారియర్ల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున నష్టపరిహారాన్ని ఢిల్లీ ప్రభుత్వం అందచేసింది. ఈ విషయాన్ని ఢిల్లీ ఆర్థిక మంత్రి అతిషి సోమవారం రాష్ట్ర బడ్జెట్ సమర్పణ సందర్భంగా అసెంబ్లీలో వెల్లడించారు. అమరవీరుల త్యాగాలను, వారి సేవలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేస్తూ అమరవీరుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించిన దేశంలోని ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. కరోనా మహమ్మారి కాలంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన 92 మంది కొవిడ్ వారియర్ల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయంతోపాటు, రూ. 1 కోటి చొప్పున నష్టపరిహారం అందించామని ఆమె తెలిపారు. దేశ రాజధానిలో కొత్తగా నాలుగు కోర్టు పముదాయాలను ఢిల్లీ ప్రభుత్వం నిర్మించనున్నదని, ఇందుకోసం ఈ బడ్జెట్‌లో రూ. 3,098 కోట్లను కేటాయించామని అతిషి చెప్పారు. రోషిణి, కర్కర్‌దూమ, శాస్త్రి పార్కు, రూస్ అవెన్యూలో కొత్త కోర్టు సముదాయాలను నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com